

స్వర్ణముఖి నది వంతెన పక్కనే విచ్చలవిడిగా ఇసుక తవ్వకాలు

ముసిలిపేడు వంతెనకు చేటు!

వాళ్ల కంటికి కనిపించేది ఇసుక.. దీని అక్రమ రవాణాతో వచ్చే డబ్బు మాత్రమే. ఈ క్రమంలో ఎవరికి.. దేనికి నష్టం వాటిల్లినా పట్టించుకోవడం లేదు. ఇలా.. ఇసుకాసురులు ముసిలిపేడు వద్ద స్వర్ణముఖి నది వంతెన కిందా ఇష్టారాజ్యంగా తవ్వేస్తున్నారు. దీనివల్ల వంతెన దెబ్బతింటుందని స్థానికులు ఆందోళన.. అభ్యంతరం వ్యక్తంచేస్తున్నా లెక్క చేయడంలేదు.

\- శ్రీకాళహస్తి, ఆంధ్రజ్యోతి

- రెచ్చిపోతున్న ఇసుకాసురులు
- యథేచ్ఛగా స్వర్ణముఖి నదిలో ఇసుక తవ్వకాలు

ఏర్పేడు మండలం ముసిలిపేడు వద్ద స్వర్ణముఖి నదిపై భారీ వంతెన ఉంది. శ్రీకాళహస్తి మండలం తొండమనాడు నుంచి ముసిలిపేడు మీదుగా పాపానాయుడుపేట వరకు సుమారు 100 గ్రామాలకు ఇదే ప్రధాన మార్గం. ఈ వంతెన సమీపంలో శ్మశానమూ ఉంది. గత వైసీపీ పాలనలో ఈ వంతెన సమీపంలో ఇష్టారాజ్యంగా అక్రమార్కులు ఇసుక తవ్వకాలను సాగించారు. రాత్రి వేళల్లో నదిలోకి దిగి ఇసుక తవ్వి బయట ప్రాంతాలకు తరలించారు. దీంతో స్థానిక రైతులు భూగర్భ జలాలు అడుగంటిపోతున్నాయంటూ గగ్గోలు పెట్టారు. అలాగే వంతెన సమీపంలో ఇసుక తవ్వకాలు జరిగితే పెనుముప్పు సంభవిస్తుందన్న ఆవేదనతో న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. దీంతో రెండేళ్ల క్రితం ముసిలిపేడు వంతెనకు ఇరువైపులా 500 మీటర్ల మేర ఎక్కడ ఇసుక తవ్వకాలు జరిగినా కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను న్యాయస్థానం ఆదేశించింది. దీంతో స్థానికులు అప్పటినుంచి తరచూ ఇసుక తవ్వకాలను అడ్డుకుంటున్నారు. రెండు సంవత్సరాల క్రితం ఇసుక తవ్వకాలు జరగకుండా వైసీపీకి చెందిన ఇసుకాసురులను ముసిలిపేడు వద్ద తరిమికొట్టారు. 5 నెలల క్రితం మళ్లీ వంతెన సమీపంలో తవ్వకాలు ఆరంభం కావడంతో 'ఆంధ్రజ్యోతి'లో కథనం ప్రచురితమైంది. దీంతో కొంత కాలం పాటు వంతెన వద్ద ఇసుక తవ్వకాలు ఆగాయి. మళ్లీ నెల రోజులుగా వంతెన పక్కనే ఉన్న బాట నుంచి నదిలోకి ట్రాక్టర్లు దిగి ఇసుక తరలించడం ప్రారంభమైంది. గతంలో రాత్రి వేళల్లో గుట్టు చప్పుడు కాకుండా తవ్వేవారు. ప్రస్తుతం పగలు, రాత్రి అన్న తేడా లేకుండా ఎంతో ధీమాగా.. వంతెన కిందనే తవ్వకాలు సాగిస్తున్నారు. పగటిపూట మనుషులతో, రాత్రిపూట యంత్రాలతో తోడేస్తున్నారు. ఇక్కడి నుంచి శ్రీకాళహస్తి, రేణిగుంట, తిరుపతి, చంద్రగిరి, చెన్నైలకు భారీ ఎత్తున ఇసుక తరలిస్తున్నారు. ఈ నిర్లక్ష్య వైఖరి మరికొద్ది రోజులు పాటు కొనసాగితే వంతెనకు చేటు తప్పదని స్థానిక రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఆ వంతెనకే దిక్కులేదు

ఏర్పేడు మండలం పాపానాయుడు పేట వద్ద స్వర్ణముఖి నదిపై ఓ వంతెన మూడేళ్ల క్రితం వరద తీవ్రతకు కొట్టుకుపోయింది. ఇప్పటికీ అక్కడ కొత్త నిర్మాణానికి అడుగు పడలేదు. ముసిలిపేడు వద్ద ఉన్న కీలకమైన వంతెన దెబ్బతింటే వంద గ్రామాలకు రాకపోకలు ఇబ్బందిగా మారతాయి. ఇక, పరివాహ ప్రాంతాల్లో భూగర్భ జలాలు అడుగంటుతాయని రైతులూ ఆందోళన చెందుతున్నారు. ఇకనైనా అధికారులు అక్రమ ఇసుక తవ్వకాలను అరికట్టడంతో పాటు వంతెనకు భద్రత కల్పించే అంశంపై ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.



5కే వాక్‌థాన్

జంక్‌ఫుడ్ మానండి. మంచి ఆహారం తీసుకోండి. వ్యాయామం చేయండి. బాల్యం నుంచే ఆటలాడండి. మెరుగైన జీవన విధానం అలవరచుకోండి. తద్వారా క్యాన్సర్ రాకుండా నివారించొచ్చంటూ అధికారులు అవగాహన కల్పించారు. ప్రపంచ క్యాన్సర్ డే సందర్భంగా తిరుపతిలోని శ్రీ వేంకటేశ్వర ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ క్యాన్సర్ హాస్పిటల్ ఆధ్వర్యంలో శుక్రవారం ఉదయం 5కే వాక్‌థాన్, సైకిల్‌ర్యాలీ నిర్వహించారు. ముందుగానే గుర్తించి తగిన చికిత్సతో క్యాన్సర్‌ను జయించవచ్చన్నారు.

\- తిరుపతి అర్బన్, ఆంధ్రజ్యోతి



బడుగు వర్గాల ఆశాజ్యోతి సంజీవయ్య

బడుగు బలహీనవర్గాల అభ్యున్నతికి పాటుపడిన ఆదర్శప్రాయుడు మాజీ ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్య అని కలెక్టర్ వెంకటేశ్వర్ పేర్కొన్నారు. దామోదరం సంజీవయ్య 104వ జయంతి వేడుకలను శుక్రవారం కలెక్టరేట్‌లో నిర్వహించారు. ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం, జేసీ శుభంబన్సల్, అదనపు ఎస్పీ రవిమనోహరాచారి, ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ కుమారమ్మ, విక్రమ్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

\- తిరుపతి(కలెక్టరేట్), ఆంధ్రజ్యోతి

డ్రంకెన్ డ్రైవ్ కేసులో ముగ్గురికి రెండు రోజుల జైలు

తిరుపతి(నేరవిభాగం), ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): అతిగా మద్యం తాగి వాహనాలు నడిపిన ముగ్గురికి రెండు రోజుల జైలు శిక్ష విధిస్తూ తిరుపతి నాలుగో అదనపు జ్యుడిషియల్ న్యాయమూర్తి గ్రంధి శ్రీనివాస్ శుక్రవారం తీర్పునిచ్చారు. ఈ ముగ్గురినీ గతంలో ఒకటికి రెండుసార్లు హెచ్చరించినా లెక్క చేయకుండా మళ్లీ మళ్లీ ట్రాఫిక్ పోలీసుల తనిఖీల్లో దొరికారు. ఈ క్రమంలో సత్యసాయి జిల్లా ధర్మవరానికి చెందిన బయన్న, తిరుపతి రిక్షాకాలనీకి చెందిన నందగోపాల్, తిరుమల బాలాజీనగర్‌కు చెందిన కుమార్‌కు రెండు రోజుల చొప్పున జైలు శిక్ష విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు. అలాగే, డ్రంకెన్ డ్రైవ్ కేసులో 12 మందిపై ట్రాఫిక్ పోలీసులు కేసులు నమోదు చేశారు. ఒక్కొక్కరికి రూ.పది వేల వంతున రూ.1.20 లక్షల జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు.



వెటర్నరీ వర్సిటీ పరిపాలనా భవనం

'అగ్రి' వర్సిటీల వీసీల నియామకాలకు గ్రీన్‌సిగ్నల్

- తొలగిన న్యాయ అడ్డంకులు
- యూజీసీ నిబంధనల ప్రకారం భర్తీకి హైకోర్టు తీర్పు
- వెటర్నరీ వీసీ పోస్టుకు పలువురు ఆశావహులు

తిరుపతిరూరల్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని వ్యవసాయ అనుబంధ వెటర్నరీ, ఉద్యానవన వర్సిటీలలో రెగ్యులర్ వీసీ పోస్టుల భర్తీకి ఎదురైన న్యాయపరమైన అడ్డంకులు తొలగిపోయాయి.

గత వైసీపీ పాలనలో నిబంధనలు ఉల్లంఘిస్తూ నోటిఫికేషన్, ఇంటర్వ్యూలను నిర్వహించకుండానే వెటర్నరీ, వ్యవసాయ వర్సిటీలకు తిరిగి మూడేళ్లపాటు వీసీలను పునర్నియమించేందుకు చొరవచూపారు. అప్పటికే నిబంధనలకు విరుద్ధంగా 2023 జూన్‌తో మూడేళ్ల పదవీకాలం ముగిసిన వైఎస్సార్ ఉద్యాన వర్సిటీ వీసీ డాక్టర్ జానకిరామ్‌ను మరో మూడేళ్లు వీసీగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. దీన్ని అవకాశంగా చేసుకుని అప్పట్లో వెటర్నరీ, వ్యవసాయ వర్సిటీ వీసీలుగా పనిచేసే డాక్టర్ వి.పద్మనాభరెడ్డి, డాక్టర్ ఎ.విష్ణువర్ధన్‌రెడ్డి తమనూ మరో మూడేళ్లు కొనసాగించాలని విన్నవించారు. దీనిపై పలువురు ప్రొఫెసర్లు అభ్యంతరం చెప్పినా అప్పటి పాలకులు లెక్కచేయని పరిస్థితి. దీనిపై పలువురు ప్రొఫెసర్లు న్యాయస్థానాల దృష్టికి తీసుకెళ్లారు. పునర్నియామక నిబంధనలపై హైకోర్టు ప్రభుత్వాన్ని స్పష్టత కోరడంతో వీసీల నియామకాలకు అప్పట్లో బ్రేక్‌పడింది. ఏడాదిన్నర కాలం తర్వాత అగ్రివర్సిటీల వీసీల నియామకాలను యూజీసీ నిబంధనల ప్రకారం చేపట్టాలని గతనెల 6న రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం(హైకోర్టు) తీర్పు వెలువరించింది. ఈ తీర్పుతో వీసీ పదవి కోసం ఆశగా ఎదురుచూస్తున్న ఆశావహ ప్రొఫెసర్లలో మళ్లీ ఆశలు చిగురించాయి. ప్రభుత్వం ఎప్పుడు నోటిఫికేషన్ జారీ చేస్తుందా అని ఆత్రుతగా ఎదురుచూస్తున్నారు. కాగా, కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక రాష్ట్రంలో ఇన్‌చార్జులున్న 17 వర్సిటీల్లో వీసీ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ జారీ చేసి, సెర్చ్ కమిటీలనూ నియమించింది. ఈ క్రమంలో త్వరలో 'అగ్రి' వర్సిటీల వీసీ పోస్టుల భర్తీకి జీవో, నోటిఫికేషన్‌ని జారీచేసి.. నియామక ప్రక్రియ పూర్తి చేయాలని అధ్యాపక, ఉద్యోగవర్గాలు కోరుతున్నాయి.

ఈసీ, వీసీ లేక పాలన అస్తవ్యస్తం

ఎస్వీ వెటర్నరీ వర్సిటీకి 2022 అక్టోబరు 31వ తేదీతో పాలకమండలి గడువు ముగిసింది. రెగ్యులర్ వీసీగా పనిచేసిన డాక్టర్ పద్మనాభరెడ్డి పదవీకాలం 2023 ఆగస్టు 4తో ముగిసింది. అప్పటి నుంచి పూర్తిస్థాయిలో ఈసీ, రెగ్యులర్ వీసీలు లేక పాలన అస్తవ్యస్తంగా మారింది. ఇప్పటి వరకు ఇన్‌చార్జి వీసీతో కలిపి ఏడుగురు ఎక్స్‌అఫిషియో సభ్యులతో ఈసీని నిర్వహించి, గతేడాది వరకు పలు నిర్ణయాలను ఆమోదించారు.2024 డిసెంబరు 31న ఎక్స్‌అఫిషియో సభ్యులలో ఒకరు పదవీ విరమణ పొందారు. దీంతో ఇప్పుడు ఈసీకి కోరం కూడా లేదు. ఈ పరిస్థితుల్లో పాలనాపరమైన అవసరాల కోసం రూ.కోట్లాది నిధులను మంజూరు చేస్తూ రాటిఫికేషన్ పెట్టుకుంటున్నారు. ఇది నిబంధనలకు విరుద్ధమని వర్సిటీ వర్గాలు అంటున్నాయి. రూ.10లక్షలకు మించి మంజూరుకు బోర్డు అనుమతి తప్పనిసరిగా ఉండాలంటున్నారు.అలాగే ఈ నెల 3 నుంచి వర్సిటీ పరిధిలోని 36మంది అధ్యాపకులకు(అసోసియేట్, ప్రొఫెసర్, సీనియర్ ప్రొఫెసర్) సీఏఎస్ పదోన్నతుల ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నారు. వీరికి బోర్డు అనుమతితోనే ఉత్తర్వులు జారీ చేయాల్సి ఉంది. పాలసీ నిర్ణయాలు, నియామకాలు, బడ్జెట్, సివిల్‌పనులు, ఉద్యోగుల డిసిప్లినరీ ప్రొసీడింగ్స్‌పదోన్నతులు వంటివి బోర్డులో పెట్టి ఆమోదం పొందాల్సి ఉంటుంది. 2022 నవంబరు ఒకటి నుంచి వర్సిటీకి పూర్తిస్థాయి ఈసీ లేకుండా పాలన సాగిస్తున్న పరిస్థితి.

ఇక్కడంతా ఇన్‌చార్జులే

వెటర్నరీ వర్సిటీలో వీసీ పోస్టుతో పాటు కీలకమైన రిజిస్ట్రార్, డైరెక్టర్ ఆఫ్ రీసెర్చ్(డీఆర్), డైరెక్టర్ ఆఫ్ ఎక్స్‌టెన్షన్(డీఈ), డెయిరీ డీన్, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్(ఈఈ), కంప్ట్రోలర్ వంటి పోస్టులలో ఇన్‌చార్జి అధికారులే కొనసాగుతున్నారు. కాగా, రెగ్యులర్ ఆఫీసర్ పోస్టుల్లో డీన్ ఆఫ్ స్టూడెంట్ అఫైర్స్(డీఎస్ఏ)గా ఉన్న ప్రొఫెసర్ డాక్టర్ జేవీరమణ ఇన్‌చార్జి వీసీగా వ్యవహరిస్తుండగా.. వెటర్నరీ డీన్, సీవోఈ పోస్టులలో రెగ్యులర్ అధికారులు కొనసాగుతున్నారు. రెగ్యులర్ వీసీ నియామకం జరిగితే వర్సిటీ ఆఫీసర్ల రిక్రూట్‌మెంట్ చేసుకునే అవకాశం ఉంటుందని వర్సిటీ ఉద్యోగ వర్గాలు అంటున్నాయి.

కల్తీ నెయ్యి కేసులో నిందితులకు రుయాలో వైద్య పరీక్షలు




తిరుపతి(వైద్యం), ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): కల్తీ నెయ్యి కేసులో నిందితులైన రాజశేఖర్, పోమిల్‌జైన్, అపూర్వ, విపిన్‌జైన్‌కు శుక్రవారం సిట్ అధికారులు రుయాస్పత్రిలో వైద్య పరీక్షలు చేయించారు. వీరిని సిట్ కస్టడీకి న్యాయస్థానం అనుమతించిన నేపథ్యంలో అలిపిరి, వెస్ట్ సీఐలు రామకిశోర్, మురళీమోహన్ వైద్య పరీక్షల నిమిత్తం 11.30 గంటలకు రుయా అత్యవసర విభాగానికి తీసుకొచ్చారు. సీఎంవో అన్వేష్ ఆధ్వర్యంలో నిందితులకు వైద్య పరీక్షలు నిర్వహించి అందరూ ఆరోగ్యంగా ఉన్నట్లు నిర్ధారించారు. తిరిగి 11.50 గంటలకు తీసుకెళ్లారు.

టీటీడీ ఇళ్ల పట్టాల్లో జగన్ బొమ్మ మాకెందుకు?

- ఉద్యోగుల్లో అసంతృప్తి
- శ్రీవారి బొమ్మతో కొత్తవి ఇచ్చే యోచనలో టీటీడీ

తిరుపతి, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): ఇటు పక్క తిరుమలలోని ఆనంద నిలయం, వేంకటేశ్వరస్వామి ఫొటో. అటువైపు జగన్ బొమ్మ చుట్టూ నవరత్నాల పేరుతో అందిస్తున్న పథకాలను ముద్రించారు. ఇదీ గత వైసీపీ ప్రభుత్వంలో టీటీడీ ఉద్యోగులకు ఇళ్ల స్థలాలను కేటాయిస్తూ ఇచ్చిన ప్రొసీడింగ్స్ కాపీలోని చిత్రాలు. ఇలా, శ్రీవారితో సమానంగా అప్పటి సీఎం జగన్ ఫొటో ముద్రించడం తీవ్ర విమర్శలకు తావిచ్చింది. అయినా అప్పటి టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి పట్టించుకోలేదు. తమ ఇళ్ల పట్టాలకు సంబంధించి ప్రొసీడింగ్స్ కాపీపై జగన్ బొమ్మ ఎందుకంటూ టీటీడీ ఉద్యోగులు అసంతృప్తి వ్యక్తంచేశారు. కూటమి ప్రభుత్వం వచ్చాక.. ఉద్యోగుల విజ్ఞప్తి మేరకు జగన్ బొమ్మను తీసేసి శ్రీవారి ఫొటోను ముద్రించి పాత ప్రొసీడింగ్స్ స్థానంలో కొత్తవి ఇచ్చే యోచనలో టీటీడీ ఉన్నట్లు తెలుస్తోంది. గతేడాది సార్వత్రిక ఎన్నికలకు ముందు వడమాలపేట మండలం పాదిరేడు అరణ్యం గ్రామంలోని 417.16 ఎకరాల వ్యవసాయ భూమిలో టీటీడీ ఉద్యోగులకు ఇళ్ల స్థలాలను కేటాయించారు. 5,350 మంది ఉద్యోగులకు ప్రొసీడింగ్స్ ఇచ్చారు. వీటిపై అప్పటి సీఎం జగన్ బొమ్మను ముద్రించడంపై విమర్శలు వచ్చాయి. పట్టాల పంపిణీని అడ్డుకునేందుకు సిద్ధమైన టీడీపీ నేతలను అప్పట్లో పోలీసులు హౌస్ అరెస్టు కూడా చేశారు. గతంలో అనేకసార్లు టీటీడీ ఉద్యోగులకు ఇంటి పట్టాలు ఇచ్చినా.. ఎన్నడూ నేతల ఫొటోలు ముద్రించలేదు. కానీ, వైసీపీ హయాంలో సొమ్ము టీటీడీది, సోకు నాయకులది అన్న చందంగా వ్యవహరించారు. ప్రభుత్వం నుంచి తాము భూమి కొనుగోలు చేశామని, ఉచితంగా ఇవ్వలేదని, అలాంటప్పుడు ప్రొసీడింగ్స్‌పై జగన్ బొమ్మ ఎందుకని టీటీడీ ఉద్యోగులు గతంలోనే బాహాటంగా ప్రశ్నించినా పట్టించుకోలేదు. ఎన్నికల్లో లబ్ధిపొందేందుకే అప్పటి టీటీడీ చైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డి జగన్ బొమ్మలు ముద్రించారని విపక్షాలు ఆరోపించాయి. ఇప్పుడా జగన్ బొమ్మలను తొలగించి, శ్రీవారి ఫొటోలతో కొత్తగా ప్రొసీడింగ్స్ ఇచ్చే ఉద్దేశంతో టీటీడీ ఉన్నట్లు సమాచారం.



TIRUMALA TIRUPATI DEVASTHANAMS
TIRUPATI, ANDHRA PRADESH.

Office of the Executive Officer,
T.T. Devasthanams, Tirupati.

Roc.No:TTD-24021(80)/2/2021 WO-SEC

Date:28-12-2023

"PROCEEDINGS"

Sub: TTD - Allotment of House Plots to Employees Under "OWN YOUR HOUSE SCHEME" at Padiredu Aranyam Village, Vadamalapeta Mandal, Tirupati District – Orders – Issued – Regarding.



స్వచ్ఛాంధ్ర మిషన్‌లో 13వ ర్యాంకు

200 పాయింట్లలో 111 సాధించిన జిల్లా

తిరుపతి, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్రలో భాగంగా పట్టణాభివృద్ధి శాఖ, పంచాయతీరాజ్ శాఖలు చేపట్టిన స్వచ్ఛాంధ్ర మిషన్‌లో జిల్లాకు 13వ ర్యాంకు దక్కింది. స్వచ్ఛాంధ్ర మిషన్ అమలు తీరుపై శుక్రవారం సీఎం చంద్రబాబు సమీక్షించారు. సంబంధిత కార్యక్రమాల అమల్లో జిల్లాలు సాధించిన ర్యాంకులను ప్రకటించారు. పట్టణాలు, నగరాలు, గ్రామ పంచాయతీల పరిధిలో ఇంటింటి నుంచి చెత్త సేకరణ, సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్, లిక్విడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్, వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణం, పబ్లిక్ టాయిలెట్లు, కమ్యూనిటీ సోక్‌పిట్స్, ఓడీఎఫ్ ప్లస్ మోడల్ తదితర 14 ప్రాధాన్యతాంశాలను తీసుకున్నారు. వీటన్నింటికీ కలిపి 200 పాయింట్లు నిర్ణయించారు. ఇందులో జిల్లాలు సాధించిన పాయింట్లను బట్టి ర్యాంకులు ప్రకటించారు. 26 జిల్లాలతో కూడిన ఈ జాబితాలో తిరుపతి జిల్లా 111 పాయింట్లతో 13వ స్థానంలో నిలిచింది. మొదటి ర్యాంకు సాధించిన ఎన్టీయార్ విజయవాడ జిల్లాకు 129 పాయింట్లు రాగా దానికీ తిరుపతి జిల్లాకు నడుమ తేడా 18 పాయింట్లు కావడం గమనార్హం. రాయలసీమ విషయానికొస్తే 122 పాయింట్లతో అనంతపురం జిల్లా మొదటి స్థానంలోనూ, 120 పాయింట్లతో అన్నమయ్య జిల్లా రెండో స్థానంలోనూ, 118 పాయింట్లతో కడప జిల్లా మూడో స్థానంలోనూ నిలవగా తిరుపతి జిల్లా నాలుగో స్థానంలో నిలిచింది. మిగిలిన సత్యసాయి, నంద్యాల, చిత్తూరు, కర్నూలు జిల్లాలు మరింత వెనుకబడ్డాయి.

చేనేత రంగం అభివృద్ధికి ప్రభుత్వాల కృషి

● ఎమ్మెల్యే పులివర్తి నాని



శిల్పారామంలో చేనేత వస్త్ర ప్రదర్శనను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే నాని

తిరుచానూరు, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): చేనేత రంగం అభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేస్తున్నాయని ఎమ్మెల్యే పులివర్తి నాని అన్నారు. తిరుచానూరు రోడ్డులోని శిల్పారామంలో శుక్రవారం చేనేత వస్త్ర ప్రదర్శనను ఆయన ప్రారంభించారు. నేతన్నలను ఆదుకోవాలనే సంకల్పంతో తిరుపతిలో చేనేత మేళా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. గత ప్రభుత్వం చేనేత రంగాన్ని నిర్వీర్యం చేసిందని ధ్వజమెత్తారు. చేనేత ప్రదర్శనను ప్రజలు సందర్శించి.. వారి ఉత్పత్తులను కొనుగోలు చేయాలని కోరారు. ఈ నెల 27వ తేదీ వరకు ఈ మేళా జరుగుతుందని తెలిపారు. అనంతరం స్టాల్స్‌ను సందర్శించి చేనేత వస్త్రాలను కొనుగోలు చేశారు. ఈ కార్యక్రమంలో ఏపీ శిల్పారామం ఆర్ట్స్ క్రాఫ్ట్ అండ్ కల్చరల్ సొసైటీ చైర్మన్ మంజులరెడ్డి, ఏవో ఖాదర్‌వల్లి, హ్యాండ్లూమ్స్ ఏడీ జ్ఞానశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఈ-శ్రమ్ పోర్టల్‌లో కార్మికుల నమోదుకు చొరవ తీసుకోండి



మాట్లాడుతున్న ఎంపీడీవో రామచంద్ర, సహాయ కార్మిక కమిషనర్ చిన్న లాలెప్ప

తిరుపతిరూరల్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని అసంఘటిత కార్మికులు ఈ-శ్రమ్ పోర్టల్‌లో నమోదుకు పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులు ప్రత్యేక చొరవ చూపాలని ఎంపీడీవో కె.రామచంద్ర ఆదేశించారు. తిరుపతి రూరల్ మండల ఎంపీడీవో సమావేశ మందిరంలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈశ్రమ్‌లో నమోదు చేసుకున్న వారికి సామాజిక భద్రతతోపాటు వివిధ సంక్షేమ పథకాలు అందుతాయని వివరించారు. కార్మిక శాఖ సహాయ కమిషనర్ చిన్నలాలెప్ప మాట్లాడుతూ రిజిస్ట్రేషన్ చేసుకున్న ప్రతి కార్మికుడికీ 12 అంకెల ప్రత్యేక గుర్తింపు కార్డు(యూఏఎన్) ఇస్తారని, దీనిద్వారా ప్రభుత్వ పథకాలు వర్తిస్తాయని తెలిపారు. అసంఘటిత రంగ కార్మిక కేటగిరీలో పనిచేస్తూ.. 16నుంచి 59సంవత్సరాల లోపు వయసు ఉండి.. ఇన్‌కమ్ ట్యాక్స్ చెల్లించని, ఈపీఎఫ్, ఈఎస్ఐ సదుపాయం లేని వారు అర్హులని వివరించారు. సహాయ కార్మిక అధికారి ప్రవీణ్‌కుమార్, ఉపాధి హామీ పథక మండల అధికారిణి మమత పాల్గొన్నారు.

ఆలోచల్లో మార్పుతో మానసిక రుగ్మతలకు చెక్



మాట్లాడుతున్న సుధాకర్‌రెడ్డి

తిరుపతి రూరల్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): మానవుడి ఆలోచనా విధానంలో మార్పు ద్వారా మానసిక రుగ్మతలకు చెక్ పెట్టవచ్చని ప్రముఖ సైకాలజిస్ట్ ఎన్‌బీ సుధాకర్‌రెడ్డి తెలిపారు. ఎమ్మార్‌పల్లెలోని యూత్ హాస్టల్‌లో సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా యూనిట్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. మన మనసే మానసిక రుగ్మతలకు కారణమని, ఆలోచనా విధానం కష్ట సుఖాలకు వేదికగా మారుతుందని వివరించారు. వృద్ధాప్యంలో వీలైనంత వరకు సుఖ జీవనాన్ని అలవాటు చేసుకోవాలని సూచించారు. అధ్యక్షుడు శ్రీనివాసులురెడ్డి, జిల్లా కార్యదర్శి రామలింగారెడ్డి, తూర్పు గోదావరి జిల్లా అధ్యక్షుడు మదన్‌మోహన్‌రెడ్డి మాట్లాడారు. గౌరవ సలహాదారు ఎస్ఎస్ రవి, సుస్వర, నారాయణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌ఎల్‌డీఎల్ సేవలను అడ్డుకున్న వెటర్నరీ విద్యార్థులు



సిటీ వెటర్నరీ ఆస్పత్రి వద్ద నిరసన తెలుపుతున్న విద్యార్థులు

తిరుపతి రూరల్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): ఎస్వీ వెటర్నరీ కళాశాల విద్యార్థులు చేపట్టిన నిరవధిక సమ్మె శుక్రవారమూ కొనసాగింది. తాతయ్యగుంట సిటీ వెటర్నరీ ఆస్పత్రి, వర్సిటీలోని టీవీసీసీ, రాష్ట్రీయ పశు వ్యాధి నిర్ధారణ లేబొరేటరీ (ఎస్ఎల్‌డీఎల్)ల వద్ద ఉదయం నుంచి సాయంత్రం వరకు సేవలు నిలిపేశారు. టీవీసీసీ వద్దకు చేరుకున్న రిజిస్ట్రార్ ప్రొఫెసర్ డాక్టర్ సీహెచ్ శ్రీలత ఓపీ సేవలు పునరుద్ధరించాలని కోరారు. ప్రభుత్వం నుంచి జీవో వచ్చే వరకు సమ్మె విరమించబోమని, అత్యవసర ఎమర్జెన్సీ సేవలకు ఆటంకం కలిగించబోమని వివరించారు. ప్రభుత్వం స్పందించకుంటే రానున్న రోజుల్లో ఎమర్జెన్సీ సేవలను సైతం బంద్ చేస్తామని తెలిపారు.

పద్మావతి వర్సిటీలో అంతర్జాతీయ సదస్సు

- బ్రోచర్లు విడుదల చేసిన వీసీలు అప్పారావు, ఉమ



తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): పద్మావతి మహిళా యూనివర్సిటీ వేదికగా ఏప్రిల్ 21వ తేదీ నుంచి మూడు రోజుల పాటు అంతర్జాతీయ సదస్సు నిర్వహించనున్నారు. సైన్స్ అండ్ టెక్నాలజీ అప్లికేషన్స్ విత్ రేర్ ఎర్త్స్ అంశంపై ఎస్వీయూ ఫిజిక్స్ - పద్మావతి వర్సిటీ బయో టెక్నాలజీ - రేర్ ఎర్త్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా సంయుక్తంగా ఈ సదస్సు చేపట్టనున్నాయి. దేశ, విదేశీ ప్రతినిధులు పాల్గొని పరిశోధనా పత్రాలు సమర్పిస్తారు. ఇందుకు సంబంధించిన బ్రోచర్లను ఎస్వీయూ వీసీ ప్రొఫెసర్ అప్పారావు, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ మాదాల భూపతి నాయుడు, పద్మావతి వర్సిటీ వీసీ ప్రొఫెసర్ ఉమ, రిజిస్ట్రార్ రజని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో రేర్ ఎర్త్స్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ ఎంఎల్‌పీ.రెడ్డి, సైన్స్ కాలేజీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ రామకృష్ణారెడ్డి, ఫిజిక్స్ విభాగాధిపతి ప్రొఫెసర్ దేవప్రసాదరాజు పాల్గొన్నారు.

సైబర్ సెక్యూరిటీపై నేడు సదస్సు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): సైబర్ సెక్యూరిటీ అంశంపై పద్మావతి మహిళా యూనివర్సిటీలో శనివారం సదస్సు నిర్వహించనున్నారు. సత్యన్న సేన ఆధ్వర్యంలో ఉదయం 10 గంటలకు ఇందిరా ప్రియదర్శినీ ఆడిటోరియంలో ఈ కార్యక్రమం ప్రారంభం కానుంది. కలెక్టర్ వెంకటేశ్వర్, ఎస్పీ హర్షవర్ధనరాజు పాల్గొంటారని సత్యన్న సేన సంస్థ అధ్యక్షుడు బాలసుబ్రమణ్యం తెలిపారు. విద్యార్థులు, ఉద్యోగులు సైబర్ నేరాలకు గురికాకుండా ఉండేలా అవగాహన కల్పించనున్నట్లు పేర్కొన్నారు.

చంద్రగిరి

గ్రామీణ పర్యాటకంతో ఉపాధి



సావనీర్‌ను విడుదల చేస్తున్న వక్తలు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ పర్యాటకం అభివృద్ధి చేస్తే ఉపాధి అవకాశాలు ఏర్పడతాయని పలువురు వక్తలు పేర్కొన్నారు. గ్రామీణ పర్యాటకం - సుస్థిర గ్రామీణ జీవనోపాధి అంశంపై శుక్రవారం సదస్సు నిర్వహించారు. ఉన్నత విద్యామండలి మాజీ వైస్ చైర్‌పర్సన్ లక్ష్మమ్మ, ఏపీ టూరిజం రీజినల్ డైరెక్టర్ రమణప్రసాద్, కాకతీయ వర్సిటీ ప్రొఫెసర్ సురేష్‌లాల్, పాండిచ్చేరి వర్సిటీ ప్రొఫెసర్ వెంకటరావు తదితరులు పాల్గొని మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న పర్యాటక ప్రాంతాలను అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఇందుకు సంబంధించిన వనరులను తొలుత గుర్తించాలన్నారు. వివిధ ప్రాంతాల ప్రతినిధులు పలు అంశాలపై పరిశోధనా పత్రాలు సమర్పించారు. కార్యక్రమంలో పలువురు అధికారులు, అధ్యాపకులు, విద్యార్థులు, ప్రతినిధులు పాల్గొన్నారు.

నేడు జూపార్క్‌లో స్నేక్ రెస్క్యూ ట్రైనింగ్

తిరుపతి మంగళం, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): ఎస్వీ జూపార్క్‌లో శనివారం, ఆదివారం స్నేక్ రెస్క్యూ ట్రైనింగ్ నిర్వహించనున్నట్లు జూ క్యూరేటర్ సెల్వం ఒక ప్రకటనలో తెలిపారు. ఆంధ్రప్రదేశ్ అటవీశాఖ, మద్రాసు క్రొకోడైల్ బ్యాంక్, సంఘమిత్ర అనిమల్ ఫౌండేషన్ వారి సంయుక్త సహకారంతో రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చే వారికి స్నేక్ రెస్క్యూ శిక్షణ కార్యక్రమాన్ని చేపట్టనున్నట్లు పేర్కొన్నారు.

21న సినీ గేయ రచయిత సుద్దాల రాక

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): ఈనెల 21వ తేదీన ప్రముఖ సినీ గేయ రచయిత డాక్టర్ సుద్దాల అశోక్‌తేజ తిరుపతికి రానున్నారు. సాయంత్రం ఐదు గంటలకు యశోదనగర్‌లోని వేమన విజ్ఞాన కేంద్రంలో 'శ్రమ కావ్య గానం' చేయనున్నారు. అశోక్‌తేజ రాసిన శ్రమ కావ్యంలోని పాటలను ఈ సందర్భంగా గానం చేస్తారు. సభలో సీఐటీయూ నేతలు నరసింగరావు, కందారపు మురళి పాల్గొంటారని నిర్వాహకులు మల్లారపు నాగార్జున తెలిపారు.

ఓంశక్తి ఆలయంలో ఎమ్మెల్యే పూజలు

తిరుపతి అర్బన్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): తిరుపతి రూరల్ ఉప్పరపల్లి చెక్‌పోస్ట్ వద్దగల ఓంశక్తి ఆలయంలో తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు శుక్రవారం ప్రత్యేక పూజలు చేయించారు. మేల్‌మరవత్తూరు ఆదిపరాశక్తి సిద్ధుల పీఠం పీఠాధిపతి బంగారు అడిగలారు 85వ జయంతి సందర్భంగా ఆలయంలో శుక్రవారం సాయంత్రం నిర్వహించిన పూజకు ఆయన హాజరై ఆధ్యాత్మిక జ్యోతిని వెలిగించారు. అనంతరం హోమంలో పాల్గొని భక్తిప్రపత్తులు చాటుకున్నారు. ఉప మేయర్ ఆర్సీ మునికృష్ణ పాల్గొన్నారు.

బలహీన వర్గాల ఆశాజ్యోతి దామోదరం సంజీవయ్య



శిల్పారామం వద్ద నివాళి అర్పిస్తున్న ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు

తిరుపతి(కలెక్టరేట్), ఫిబ్రవరి 14(ఆంధ్ర జ్యోతి): దళిత సంఘాల ప్రతినిధుల ఆధ్వర్యంలో శిల్పారామం వద్ద దామోదరం సంజీవయ్య జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆయన విగ్రహానికి చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు పూలమాలలు వేసి, నివాళి అర్పించారు. అనంతరం విగ్రహం చుట్టు పక్కల పరిసరాలను శుభ్రం చేయించారు.

రెండు ద్విచక్ర వాహనాలు ఢీ

● ఇద్దరికి గాయాలు

రామచంద్రాపురం, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని రామచంద్రాపురం - పచ్చికాపలం రోడ్డులో పెట్రోల్ బంక్ వద్ద శుక్రవారం ఉదయం రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్న సంఘటనలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసుల కథనం మేరకు... వెదురుకుప్పం మండలం మాంబేడుకు చెందిన భగీరథ తిరుపతికి వస్తుండగా అదే సమయంలో తిరుపతి రూరల్ మండలం ముళ్లపూడికి చెందిన ముత్తుమారి మణి తిరుపతి నుంచి రామచంద్రాపురం వస్తూ పెట్రోల్ బంకుకు వెళుతుండగా రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ముత్తుమారి మణికి తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. భగీరథకు స్వల్ప గాయాలయ్యాయి. ఇద్దరిని చికిత్స నిమిత్తం తిరుపతి రుయా ఆసుపత్రికి తరలించి, పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రారంభ దశలో ఆహ్లాదకర బోధన చేపట్టాలి



బోధన, అభ్యాసనా సామగ్రిని పరిశీలిస్తున్న ఎంఈవో-2 సతీష్‌బాబు

ఎర్రావారిపాలెం, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి) ; ప్రారంభ దశలో ఆహ్లాదకర బోధన చేస్తే పిల్లలు చదువు పట్ల మక్కువ పెంచుకుంటారని ఎంఈవో-2 సతీష్ బాబు అన్నారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండలంలోని 37 అంగన్వాడీ కేంద్రాల టీచర్స్‌కు జరుగుతున్న శిక్షణా తరగతులను ఆయన పరిశీలించారు. అంగన్వాడీ కేంద్రాల్లో పౌష్టికాహారంతో పాటు బోధన చేపట్టడం వల్ల పిల్లలు అక్షరాభ్యాసం నేర్చుకుంటారని తెలిపారు. అంగన్వాడీ టీచర్ తయారు చేసిన బోధనా అభ్యాసన సామగ్రిని ఆయన పరిశీలించారు. ఐసీడీసీ పర్యవేక్షకురాలు భారతి, ఉపాధ్యాయుడు జగదీష్ పాల్గొన్నారు.

ప్రేమించి మోసం చేసిన వ్యక్తిపై పోక్సో కేసు

కేవీబీపురం, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని హనుమాయి కండ్రిగకు చెందిన మునెమ్మ (19) గాజులమండ్యం మండలం ఎస్సీ కాలనీకి చెందిన ప్రవీణ్ (27) రేణిగుంట వద్ద ఓ ప్రైవేట్ ఫ్యాక్టరీలో పనిచేస్తుంటారు. మూడేళ్లుగా ప్రేమించుకుంటు న్న వీళ్ల పెళ్లి చేసుకోవాలనుకున్నారు. అయితే ప్రవీణ్ వేరే అమ్మాయిని వివాహం చేసుకున్నాడు. అయినా మునెమ్మ.. ప్రవీణ్‌తో సన్నిహితంగా ఉండేది. ఇటీవల మునెమ్మ గర్భం దాల్చింది. దీంతో వీరిద్దరి మధ్య గొడవలు ప్రారంభమయ్యాయి. ఈక్రమంలో బాధితురాలు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా ఎస్ఐ నరేష్ దర్యాప్తు చేపట్టారు. ఈ క్రమంలో ప్రవీణ్‌పై పోక్సో కేసు పెట్టి అదుపులోకి తీసుకున్నారు. శ్రీకాళహస్తి కోర్టుకు తరలించారు.

ప్రభుత్వ పథకాలు ప్రయోజనకరంగా ఉండాలి

● కలెక్టర్ వెంకటేశ్వర్



గోకులం షెడ్డు ప్రయోజనాలను రైతు నుంచి తెలుసుకుంటున్న కలెక్టర్

భాకరాపేట, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పథకాలు ప్రజలకు ప్రయోజనకరంగా ఉండాలని కలెక్టర్ వెంకటేశ్వర్ అన్నారు. చిన్నగొట్టిగల్లు మండలం భాకరాపేట పంచాయతీ ఎన్టీఆర్ కాలనీలో సుమారు రూ.13 లక్షల ఉపాధి నిధులతో నిర్మితమవుతున్న సీసీ రోడ్లను శుక్రవారం ఆయన పరిశీలించారు. స్థానికులతో మాట్లాడుతూ రోడ్ల వల్ల ప్రయోజనం ఉందా, ముందు ఎలా ఉంది, ఇప్పుడు ఎలా ఉంది అంటూ పలు ప్రశ్నలు వేసి వారి నుంచి సమాధానాలు రాబట్టారు. గతంలో వర్షం వస్తే బురదగా ఉండేదని, ప్రస్తుతం సిమెంటు రోడ్ల వల్ల ప్రయోజనం ఉందని ప్రజలు తెలియజేశారు. అనంతరం రైతు శ్రీనివాసులు పొలంలో నిర్మించిన గోకులం షెడ్డును పరిశీలించారు. గోకులం షెడ్డు ఉపయోగాలను శ్రీనివాసులును అడిగి తెలుసుకోవడమే కాకుండా అతను తయారు చేసుకుంటున్న జీవామృతాన్ని పరిశీలించారు. గోకులం షెడ్ల బిల్లులు రాలేదని ఆయన దృష్టికి పలువురు రైతులు తీసుకెళ్లగా 15 రోజుల్లో చెల్లిస్తామని తెలియజేశారు. అనంతరం రాజువారిపల్లె దగ్గర రైతు నరసింహులు పొలంలో తీసిన కందకాలను పరిశీలించారు. నిర్దేశించిన లక్ష్యాలను సకాలంలో పూర్తి చేయాలని సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో డ్వామా పీడీ శ్రీనివాస ప్రసాద్, మైక్రో ఇరిగేషన్ పీడీ సతీశ్, జిల్లా ఉద్యాన శాఖాధికారి దశరథరామిరెడ్డి, తహసీల్దారు జనార్దన్ రాజు, ఎంపీడీవో గిడ్డయ్య, ఈవోపీఆర్‌ఆర్‌డీ సోమశేఖర రెడ్డి, పశువైద్యాధికారి స్రవంతి, ఉద్యాన శాఖాధికారి శివకుమారి, వ్యవసాయ అధికారి ధనలక్ష్మి, ఏపీవో భార్గవి, పీఆర్ ఏఈ ప్రకాశ్ రెడ్డి, కార్యదర్శులు రామ్మోహన్, గిరిబాబు, టీడీపీ క్లస్టర్ ఇన్‌ఛార్జ్ శివకుమార్, దామోదర్ తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్ ఆకస్మిక తనిఖీలు

ఎర్రావారిపాలెం (ఆంధ్రజ్యోతి): మండలంలో శుక్రవారం కలెక్టర్ వెంకటేశ్వర్ ఆకస్మిక తనిఖీలు చేశారు. చెరుకువారిపల్లె పంచాయతీలో పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో ఉపాధి హామీ పథకం నిధులతో చేపట్టిన సీసీ రోడ్ల నిర్మాణాలను పరిశీలించారు. హార్టికల్చర్ ఆధ్వర్యంలో మామిడి తోటల రైతులు నిర్మించిన ప్యాక్ హౌస్‌లను పరిశీలించి రైతులతో మాట్లాడారు. మండలంలో ఉద్యానవన పంటలకు అనువైన వాతావరణం, నేల స్వభావాలను కలెక్టర్‌కు అధికారులు వివరించారు. తహసీల్దార్ పరమేశ్వర స్వామి, ఉద్యానవన, ఈజీఎస్, పంచాయతీ రాజ్ అధికారులు ఆయన వెంట ఉన్నారు.

పుల్వామా అమరులకు ఘన నివాళి



ఎస్వీయూలో అమరులకు పుష్పాంజలి ఘటిస్తున్న ఏబీవీపీ శ్రేణులు - కపిలతీర్థం సమీపంలోని అమరవీరుల స్థూపం వద్ద నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు)/(విద్య), ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): పుల్వామా ఉగ్రదాడిలో అమరులైన వీర జవానులకు ఏబీవీపీ ఘన నివాళి అర్పించింది. ఎస్వీయూలో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో పుల్వామా అమరుల చిత్రాలకు ఆర్ఎస్ఎస్ నేత అశోక్, ఆర్ట్స్ కాలేజీ ప్రిన్సిపాల్ సుధారాణి, ఏబీవీపీ రాష్ట్ర వర్సిటీల కన్వీనర్ తరుణ్ తదితరులు పుష్పాంజలి ఘటించి నివాళి అర్పించారు. వీర జవాన్ల త్యాగాన్ని యువత స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు.

బీజేపీ నేతల నివాళి..

స్థానిక బీజేపీ నాయకులు కపిలతీర్థం సమీపంలోని అమరవీరుల స్థూపం వద్ద కొవ్వొత్తులు వెలిగించి పుష్పాంజలి ఘటించారు. గుండాల గోపీనాథ్‌రెడ్డి, ప్రభాకర్‌నాయుడు, చంద్రబాబుయాదవ్, సుబ్రహ్మణ్యం రెడ్డి, మల్లారపు రవిప్రసాద్, మస్తాన్, సత్యకుమార్, బాలాజీ, చంగల్‌రాయులు పాల్గొన్నారు.

దామోదరం సంజీవయ్య సేవలు చిరస్మరణీయం



తిరుపతి(నేరవిభాగం),ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ తొలి ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్య సేవలు చిరస్మరణీయమని ఎస్పీ హర్షవర్ధన రాజు కొనియాడారు. సంజీవయ్య జయంతి సందర్భంగా శుక్రవారం ఎస్పీ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. ఎస్పీ మాట్లాడుతూ దళిత కుటుంబంలో పుట్టి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా ఎనలేని సేవలు చేశారన్నారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీలు రవిమనోహరాచారి, శ్రీనివాసరావు, డీఎస్పీలు పాల్గొన్నారు.

అన్ని పంచాయతీల్లో చెత్త సంపద కేంద్రాలు



తిరుచానూరులో చెత్త సంపద కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీపీవో సుశీలాదేవి, జిల్లా కోఆర్డినేటర్ శిరీష

తిరుచానూరు, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని అన్ని గ్రామ పంచాయతీల్లో సాధ్యమైనంత త్వరగా చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను వినియోగంలోకి తీసుకొస్తామని డీపీవో సుశీలాదేవి అన్నారు. శుక్రవారం తిరుచానూరు పంచాయతీలో ఉన్న ఎస్‌డబ్ల్యూపీసీని జిల్లా కోఆర్డినేటర్ శిరీషతో కలిసి పరిశీలించారు. వర్మీకంపోస్టు ఎరువు ప్రక్రియ మరింత వేగవంతం చేయాలని పంచాయతీ అధికారులకు సూచించారు. ఆమె మాట్లాడుతూ జిల్లాలో 610 చెత్త సంపద కేంద్రాలను వినియోగంలోకి తీసుకొచ్చి వర్మీ కంపోస్టు ఎరువులు కూడా విక్రయించనున్నట్లు తెలిపారు. ప్రతి పంచాయతీలో తడి, పొడి చెత్తను వేరు చేసి వర్మీ కంపోస్టు తయారు చేయనున్నట్లు ఆమె చెప్పారు. ఈకార్యక్రమంలో ఈవోపీఆర్డీ వెంకటరత్నం తదితరులు పాల్గొన్నారు.

తిరుపతిరూరల్ (ఆంధ్రజ్యోతి): తిరుపతి రూరల్ మండలం అవిలాల గ్రామ పంచాయతీలోని చెత్తసంపద కేంద్రాన్ని(ఎస్‌డబ్ల్యూపీ) శుక్రవారం డీపీవో సుశీలాదేవి సందర్శించారు. పలు సలహాలు, సూచనలు చేశారు. సర్పంచ్ చెందిలి వెంకటరమణ, పంచాయతీ కార్యదర్శి టి.శ్రీలేఖ తదితరులు పాల్గొన్నారు.

సావిత్రిబాయి పూలే విగ్రహ ప్రతిష్ఠకు భూమిపూజ



భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే ఆరణి, బీసీ సంఘర్షణ సమితి నాయకులు

తిరుపతి (జీవకోన), ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): బీసీ సంఘర్షణ సమితి ఆధ్వర్యంలో స్థానిక మహిళా విశ్వవిద్యాలయం సమీపంలో సీతమ్మనగర్ 80 అడుగుల రోడ్డు పడమర సర్కిల్ వద్ద సావిత్రిబాయి పూలే విగ్రహ ప్రతిష్ఠ కోసం శుక్రవారం భూమిపూజ చేశారు. ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, మేయర్ డాక్టర్ శిరీష, టీడీపీ తిరుపతి పార్లమెంటు నియోజకవర్గ అధ్యక్షుడు నరసింహ యాదవ్ పాల్గొని భూమిపూజ చేశారు. వారు మాట్లాడుతూ మహిళలకు చదువు నేర్పిన మొదటి పంతులమ్మ సావిత్రిబాయి పూలే అని కొనియాడారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్లు ఆర్సీ మునికృష్ణ, ముద్ర నారాయణ, కార్పొరేటర్లు అన్నా అనిత యాదవ్, నరసింహాచారి, నరేంద్రనాథ్, ఆదం సుధాకర్ రెడ్డి, రుద్రకోటి సదాశివం, అంజయ్య, చిన్నం పెంచలయ్య, పరమశివం, బీసీ సంఘర్షణ సమితి అధ్యక్షుడు అక్కినపల్లి లక్ష్మయ్య, నాయకులు పాల్గొన్నారు.

సామంచికి బార్ అసోసియేషన్ సన్మానం



తిరుపతి, ఫిబ్రవరి14(ఆంధ్రజ్యోతి) : సీనియర్ న్యాయవాది సామంచి శ్రీనివాస్ బీజేపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడిగా ఎన్నికైన సందర్భంగా శుక్రవారం స్థానిక కోర్టు ప్రాంగణంలో న్యాయవాదులు ఆయనను ఘనంగా సత్కరించారు. న్యాయవాద సంఘ నాయకులు మాట్లాడుతూ సామంచి తొలి నుంచి సామాజిక స్పృహ, సేవాభావం కలిగి ఉన్న వ్యక్తి అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ నాయకులు గోపీచంద్, భవానీశంకర్, దినకర్, మార్టిన్, ముక్కు సత్యవంతుడు, సురేష్, చెంజి రమేష్, భార్గవ్, శ్యామల, వాణి, మంజుల తదితరులు పాల్గొన్నారు.

మహాశివరాత్రి ఉత్సవాలకు విచ్చేయండి



చిరంజీవికి, బాలకృష్ణకు ఆహ్వానపత్రిక అందిస్తున్న ఎమ్మెల్యే సుధీర్

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): పంచభూత లింగాల్లో వాయులింగేశ్వరుడిగా పరమశివుడు కొలువైన శ్రీకాళహస్తి క్షేత్రంలో జరిగే మహాశివరాత్రి ఉత్సవాలను దర్శించండి అంటూ ఎమ్మెల్యే సుధీర్ పలువురు ప్రముఖు లను ఆహ్వానించారు. ఈ మేరకు హైదరాబాద్‌లో శుక్రవారం ఆహ్వాన పత్రికలు అందజే శారు. తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి, కేంద్ర మాజీ మంత్రి, మెగాస్టార్ చిరంజీవి, హిందూ పురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ, సినీ హీరో నితిన్, టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడును మర్యాదపూర్వకంగా కలిసి కలంకారి వస్త్రాలతో వారిని సత్కరించి ఆహ్వాన పుస్తకాలను అంద జేసి ఉత్సవాల్లో జరిగే విశేష ఘట్టాలను వివరించారు. గత వైసీపీ పాలనలో ముక్కంటి ఆలయ మహాశివరాత్రి ఉత్సవాలకు ప్రముఖు లను ఆహ్వానించడం విస్మరించారన్నారు. ప్రస్తు తం కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత తొలి మహాశివరాత్రి ఉత్సవాలు కావడంతో శ్రీకాళహస్తి క్షేత్ర వైశిష్ట్యాన్ని వ్యాప్తి చేస్తున్నామ న్నారు. అందుకే రెండు తెలుగు రాష్ట్రాలతో పాటు జాతీయస్థాయిలో ప్రముఖులందరినీ ఉత్సవాలకు ఆహ్వానిస్తున్నామని ఎమ్మెల్యే పేర్కొన్నారు.

ప్రమాదాల నివారణపై మాక్‌డ్రిల్



కార్మికులకు అవగాహన కల్పిస్తున్న సీఐ

సత్యవేడు, ఫిబ్రవరి 14: పరిశ్రమల్లో అగ్ని, గ్యాస్ లీకేజీ ప్రమాదాలు సంభవించినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పాటించాల్సిన చర్యలపై శ్రీసిటీలోని మాండలెజ్ పరిశ్రమలో సీఐ శ్రీనివాసులు ఆధ్వర్యంలో ఫైర్, రెస్క్యూ బృందాలు మాక్ డ్రిల్ ద్వారా అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ పరిశ్రమల్లో ఏదైనా ప్రమాదం జరిగినప్పుడు అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. పోలీస్, ఫైర్ సిబ్బందికి వెంటనే సమాచారం అందించాలన్నారు. ప్రమాదంలో ఎవరైనా నడవలేని వారు ఉంటే క్యూఆర్‌టీ టీం ద్వారా ప్రథమ చికిత్స అందించాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్ఐ హరిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ట్రాక్టర్ డ్రైవర్ మృతి

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో ట్రాక్టర్ డ్రైవర్ వెంకటయ్య మృతి చెందాడు. ఈ ఘటన ఏర్పేడు మండలంలోని చింతలపాళెం వద్ద గురువారం జరిగింది. శ్రీకాళహస్తి మండలం గొల్లపల్లికి చెందిన వెంకటయ్య ట్రాక్టర్ మరమ్మతుల కోసం స్వయంగా నడుపుకుంటూ ఏర్పేడుకు వెళ్లాడు. తిరుగు ప్రయాణంలో చింతలపాలెం వద్ద ట్రాక్టర్ అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ఘటంలో వెంకటయ్య వాహనం కింద ఇరుక్కుని అక్కడికక్కడే మృతి చెందాడు. ఏర్పేడు పోలీసులు మృతదేహాన్ని ఏరియా ఆస్పత్రి మార్చురీకి తరలించారు.




అస్తవ్యస్తంగా ఇరుకిరుకు సందులు.. అడ్డదిడ్డంగా చెత్తకుప్పలు.. రేకులు వేలాడే కప్పులు.. పెచ్చులు రాలిపోయిన, సున్నం వెలిసిపోయిన గోడలు.. జానెడు ఇళ్లున్న స్కావెంజర్స్ కాలనీ అది. ఎదురుగా చేపల మార్కెట్.. ఆ పక్కనే నిత్యం శవాలు కాలుతుండే స్మశానం.. తిరుపతి నగరంలో అత్యంత మురికివాడగా పేరుబడ్డ స్కావెంజర్స్ కాలనీ రూపురేఖలు హఠాత్తుగా మారిపోతున్నాయి. అవే ఇరుకు వీధులు.. అవే ఇళ్లు.. మనుషులూ వారే.. కాకపోతే ఆ ఇరుకిరుకు ఇళ్లకే అందాలు అద్దుతున్నారు. సున్నాలు వేశారు.. రంగులు పూశారు.. సముద్ర ఆకాశాలను గోడలమీదకు తీసుకువస్తున్నారు. ఆకర్షణీయమైన రంగు రంగుల బొమ్మలతో ప్రతి ఇల్లూ మారిపోతోంది. ఎగిరే సీతాకోక చిలుకలు, ఈదులాడే చేపలు, పుస్తకాలను పట్టుకున్న చేతులు, చదువుకునే పిల్లలు.. పూలు.. లతలూ.. పచ్చని మొక్కలు.. జానపద కథల్లో దేవకన్యలు రాత్రికి రాత్రి సృష్టించిన అందాల నగరంలా కనిపిస్తోంది ఆ ప్రాంతం ఇప్పుడు.

- తిరుపతి(లీలామహల్), ఆంధ్రజ్యోతి

ఎలా జరిగిందంటే..

తిరుపతి కమిషనర్ మౌర్య తెల్లవారకముందే నగరంలోని పలు ప్రాంతాలను సందర్శిస్తున్నారు. మురికి కాలువలు, చెత్తకుప్పలు చూసి, నీటి సమస్యలు విని సిబ్బందికి ఆదేశాలు ఇస్తున్నారు. ఇందులో భాగంగా స్కావెంజర్స్ కాలనీలోనూ తిరిగినపుడు ఆమె మనసు వికలమైంది. భరించలేని వాసన.. చెత్త.. వాటి మధ్యనే కాపురాలు! ఇప్పటికిప్పుడు వారి జీవన స్థితిగతులనైతే మార్చలేం గానీ, కనీసం వారు నివసించే ప్రదేశాలనైనా శుభ్రంగా, అందంగా తీర్చిదిద్దవచ్చని అనిపించింది. స్మార్ట్‌సిటీ స్వచ్ఛసర్వేక్షణ్ నిధుల ఆసరాతో మురికివాడకు రంగులేసే పనికి శ్రీకారం చుట్టారు. అక్కడి ప్రజలకు అవగాహన కల్పించి వారి నివాసాలను ఇలా రంగులమయం చేస్తున్నారు. అందంగా మారిన తమ ఇళ్లను చూసుకుని స్కావెంజర్స్ కాలనీ జనం మురిసిపోతున్నారు.



గతంలో అటకెక్కిన 11 అంతస్థుల కాంప్లెక్స్

తిరుపతి నగరంలో ఒక మరకలా కనిపించే స్కావెంజర్స్ కాలనీని మార్చాలని ఆరేడేళ్ల కిందట టీడీపీ ప్రభుత్వంలో చేసిన ప్రయత్నం విఫలమైంది. 300 మంది నివసిస్తున్న 5 ఎకరాల విస్తీర్ణం ఉన్న కాలనీలో విశాలమైన 11 అంతస్థుల భవనం నిర్మించాలని భావించారు. కాలనీలో ఇళ్లున్న అందరికీ అందులో భాగస్వామ్యం ఇస్తామని చేసిన ప్రతిపాదనను అప్పట్లో ఇక్కడి ప్రజలు తీవ్రంగా వ్యతిరేకించారు. ఆ తర్వాత జగనన్న ప్రభుత్వం లో వైసీపీ పెద్దలెవరూ ఈ కాలనీ ముఖం కూడా చూడలేదు. ఇన్నేళ్ల తర్వాత ఇప్పుడు కనీసం కాలనీని అందంగా మారుస్తున్నారు.





5కే వాక్‌థాన్‌లో పాల్గొన్న ఎమ్మెల్యే శ్రీనివాసులు, కలెక్టర్ వెంకటేశ్వర్, ఎస్పీ హర్షవర్ధన్‌రాజు

సరైన జీవన విధానంతో క్యాన్సర్ దూరం

తిరుపతి అర్బన్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): మంచి ఆహారపు అలవాట్లు, వ్యాయామం, జీవన విధానం ద్వారా క్యాన్సర్ సంక్రమించకుండా చేయవచ్చునని, ముందుగానే గుర్తించడం, మెరుగైన చికిత్స ద్వారా ప్రాణం కాపాడుకోవచ్చని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, కలెక్టర్ వెంకటేశ్వర్, ఎస్పీ హర్షవర్ధన్‌రాజు తెలిపారు. ప్రపంచ క్యాన్సర్ డేను పురస్కరించుకుని శ్రీవేంకటేశ్వర ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ క్యాన్సర్ హాస్పిటల్ ఆధ్వర్యంలో శుక్రవారం 5కే వాక్‌థాన్, సైకిల్ ర్యాలీ నిర్వహించారు. దాదాపు 800మంది పాల్గొన్నారు. అతిథులు మాట్లాడుతూ క్యాన్సర్‌పై ప్రజల్లో చైతన్య కల్పించడానికి ర్యాలీ నిర్వహించడం సంతృప్తిగా ఉందన్నారు. బాల్యం నుంచే మెరుగైన జీవన విధానం అలవరుచుకోవాలని, జంక్‌ఫుడ్‌కు దూరంగా ఉండాలని, క్రీడలను బడిఈడు నుంచి అలవాటు చేసుకోవాలని కోరారు. క్యాన్సర్ రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు స్క్రీనింగ్ సర్వేలు చేస్తున్నట్లు చెప్పారు. టాటా క్యాన్సర్ హాస్పిటల్ నిర్వాహకులు చేపడుతున్న అవగాహన, నివారణ కార్యక్రమాలు అభినందనీయమన్నారు. కార్యక్రమంలో క్యాన్సర్ హాస్పిటల్ మెడికల్ డైరెక్టర్ డాక్టర్.ప్రశాంత్ డీపీఎంఓ డాక్టర్ శ్రీనివాసులు, డీఎంహెచ్‌వో బాలకృష్ణనాయక్, పలువురు వైద్యాధికారులు పాల్గొన్నారు.

బెస్ట్ ఆర్కిటెక్ట్ అవార్డు ప్రదానం



అవార్డు అందుకుంటున్న తారకరామ నాయుడు

తిరుపతి, ఫిబ్రవరి14(ఆంధ్రజ్యోతి) : ఎడ్జ్ ఇంటీరియర్స్ అండ్ ఇంజినీరింగ్స్ సంస్థ అధినేత తారకరామ నాయుడు (డిజైనర్ తారక్) బెస్ట్ ఆర్కిటెక్ట్, డిజైన్ అవార్డు అందుకున్నారు. మెరిట్ అవార్డ్స్ అండ్ మార్కెట్ రీసెర్చ్ (ఎంఏఎంఆర్) ప్రైవేట్ లిమిటెడ్ శుక్రవారం ఢిల్లీలో నిర్వహించిన అవార్డుల ప్రదానోత్సవంలో ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఆర్కిటెక్ట్ (ఐఐఏ) ఛైర్మన్ కృష్ణారావు జైసిమ్ ముఖ్య అతిథిగా హాజరై అవార్డు అందజేశారు. తిరుపతికి చెందిన తారక్ ఆర్కిటెక్ట్, ఇంటీరియర్ రంగంలో అనతికాలంలోనే తనదైన గుర్తింపు తెచ్చుకున్నారు. బెంగళూరు, తిరుపతి నగరాల్లో ప్రముఖ సంస్థల నిర్మాణాలకు డిజైన్స్ చేస్తున్నారు.

ఆప్కాస్ రద్దును ఉపసంహరించుకోవాలని ధర్నా



తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): అప్కాస్ రద్దును విరమించుకోవాలంటూ తిరుపతిలోని ఎస్వీ అగ్రికల్చర్ కాలేజీ వద్ద కార్మికులు శుక్రవారం ఆందోళన చేపట్టారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి జయచంద్ర, అప్కాస్ అధ్యక్షుడు చిన్నబాబు మాట్లాడుతూ ఆప్కాస్‌ను రద్దు చేయకూడదని, దాని పరిధిలో పనిచేస్తున్న కార్మికులకు కనీస వేతనం వర్తింపజేయాలని కోరారు. ప్రైవేట్ ఏజెన్సీల ద్వారా నియామకాలు జరిపితే పారదర్శకత లోపిస్తుందన్నారు. రిజర్వేషన్లు ఇప్పటి వరకూ పనిచేస్తున్న కార్మికులను కాంట్రాక్టు ఉద్యోగులుగా మార్చాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు ప్రభాకరరెడ్డి, శంకరయ్య, మునిరాజ, రమేష్, రవి, మోహన్, గురవయ్య, పరంధామయ్య, సుబ్రమణ్యం, యుగంధర్, భార్గవ్‌బాబు, ధనుంజయ తదితరులు పాల్గొన్నారు.

గంగమ్మ గుడి అభివృద్ధికి కృషి



గంగమ్మ ఆలయంలో పూజలు చేయిస్తున్న మునికృష్ణ

తిరుపతి, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి) : నగరపాలక సంస్థ డిప్యూటీ మేయర్‌గా ఎన్నికైన ఆర్సీ మునికృష్ణ శుక్రవారం స్థానిక టి.నగర్‌లోని నడివీధి గంగమ్మ ఆలయంలో పూజలు చేయించారు. గంగమ్మ ఆలయ అభివృద్ధికి కృషి చేస్తామని ఈ సందర్భంగా చెప్పారు. అనంతరం 36వ డివిజన్లోని కూటమి నేతలు ఆయనను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో టీడీపీ, జనసేన నాయకులు చిత్తూరు రవిశంకర్ యాదవ్, వినోద్ రాయల్, శంకర్ యాదవ్, ఆముదాల వెంకటేష్, శేషాద్రి రాయల్, శ్రీనివాస్ యాదవ్, కృష్ణ యాదవ్, గౌస్ బాషా, యాసిన్, భారతి, జయంతి, శ్రీధర్, రవినాయుడు, మునిరాయల్, మధు యాదవ్, అబ్దుల్లా, ప్రేమ్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

తిరుపతి(ఆటోనగర్), ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): తిరుపతి విద్యుత్ టౌన్ డివిజన్ సౌత్, మంగళం సెక్షన్ల పరిధిలో శనివారం ఉదయం 8.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని తిరుపతి డివిజన్ ఈఈ వి.చంద్రశేఖరరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రెండు సెక్షన్ల పరిధిలోని టాటానగర్, తిమ్మినాయుడుపాళెం, తిరుమలనగర్, వీడీ నగర్, శెట్టిపల్లి ఫీడర్ల పరిధిలో విద్యుత్ తీగలు, విద్యుత్ నియంత్రికలు మరమ్మతులు చేయడం, కొమ్మల తొలగింపు కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు.

వేద వర్సిటీలో భద్రేష్‌దాస్ స్వామి



తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఫిబ్రవరి 14 (ఆంధ్ర జ్యోతి): శ్రీవేంకటేశ్వర వేద విశ్వవిద్యాలయంలో శుక్రవారం ఢిల్లీ అక్షరధామ్ నారాయణ సంస్థాన్‌కు చెందిన మహామహోపాధ్యాయ డాక్టర్ భద్రేష్‌దాస్ స్వామి తదితరులు పర్యటించారు. వేదవర్సిటీ వీసీ ఆచార్య రాణీసదాశివమూర్తితో సమావేశమయ్యారు. వేద పఠనం విని ప్రశంసించారు. వేద విద్య బోధన, పరిశోధన, విస్తరణ రంగాల్లో చేస్తున్న కృషిని వీసీ వివరించారు. అనంతరం విద్యార్థులు చేసిన చతుర్వేద మంత్ర పఠనాన్ని విన్న స్వామీజీలు వారి ప్రతిభను కొనియాడారు. విద్యార్థులందరూ ఒక్కసారి అక్షరధామ్‌ను సందర్శించాలని కోరారు. కార్యక్రమంలో డీన్లు గోళి సుబ్రమణ్యశర్మ, తారకరామకుమారశర్మ, పవన్, ఉమేష్, బ్రహ్మాచార్యులు పాల్గొన్నారు.

ఉమ్మడి పీజీ సెట్ రద్దు చేయాలి



సంఘీభావం తెలియజేస్తున్న విద్యార్థి సంఘాల నాయకులు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): యూనివర్సిటీల్లో పీజీ ప్రవేశానికి చేపట్టిన ఉమ్మడి పీజీ సెట్ రద్దు చేయాలని ఐక్య విద్యార్థి సంఘాలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశాయి. ఎస్వీయూలోని భవన్ ఎదుట శుక్రవారం వివిధ విద్యార్థి సంఘాలు రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించాయి. ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బండి చలపతి, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు అక్బర్, ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర కార్యదర్శి మల్లికార్జున, గిరిజన నవసమాజ్ నేత శివశంకరనాయక్, లా విద్యార్థి సంఘ నేత సుందర్రాజు, బీసీ విద్యార్థి సంఘ నేత తిరుమలేష్ మాట్లాడారు. పీజీ ప్రవేశానికి చేపట్టిన ఉమ్మడి పీజీ సెట్ వల్ల అడ్మిషన్ల సంఖ్య భారీగా తగ్గిందన్నారు. మారుమూల ప్రాంతాల విద్యార్థులకు ఉమ్మడి పీజీ సెట్ నోటిఫికేషన్ వచ్చిన సమాచారం కూడా తెలియకపోతోందన్నారు. ఇందువల్ల విద్యార్థులు లేక యూనివర్సిటీల్లో అనేక విభాగాలు మూతపడే పరిస్థితి ఏర్పడిందన్నారు. యూనివర్సిటీలకే పీజీ అడ్మిషన్లు నిర్వహించుకునే అధికారమిస్తే విద్యార్థుల సంఖ్య పెరుగుతుందన్నారు. ఉమ్మడి పీజీ సెట్ రద్దు చేయకపోతే యూనివర్సిటీల బంద్‌కు పిలుపునిస్తామన్నారు. ఈ నెల 17వ తేదీ నుంచీ దశలవారీగా ఉద్యమాన్ని చేపడతామని ప్రకటించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు అశోక్, ఏఐఎస్ఎఫ్ నేత ప్రవీణ్, ఎస్సీ, ఎస్టీ సెల్ నేత మురళి, నాయకులు చంద్రనాయక్, రాజు, విజయ్, మహేంద్ర, నవీన్ పాల్గొన్నారు.

జాతీయ బ్యాంకుల్లో ఖాళీలను భర్తీ చేయాలి





టీపీ ఏరియాలోని పంజాబ్ నేషనల్ బ్యాంక్ ఎదుట - తిలక్ రోడ్డులోని ఎస్‌బీఐ ఎదుట ధర్నా చేస్తున్న బ్యాంక్ ఉద్యోగులు

తిరుపతి(ఆటోనగర్), ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి) :జాతీయ బ్యాంకుల్లో ఖాళీలను వెంటనే భర్తీ చేయాలని యూఎఫ్‌బీయూ కన్వీనర్ పి.విజయభాస్కర్, టీబీఈసీసీ ప్రధాన కార్యదర్శి జె.ధన్వంత్ కుమార్ డిమాండ్ చేశారు. స్థానిక టీపీ ఏరియాలోని పంజాబ్ నేషనల్ బ్యాంక్ ఎదుట యునైటెడ్ ఫోరమ్ ఆఫ్ బ్యాంక్ యూనియన్స్ పిలుపుమేరకు శుక్రవారం ధర్నా చేశారు. వారు మాట్లాడుతూ గత ఏడాది మార్చి 8న ఐబీఏ యూనియన్ నాయకులతో కుదిరిన ఒప్పందం మేరకు 15 రోజుల్లో సమస్యలు పరిష్కరిస్తామని ఇచ్చిన హామీ నెరవేర్చకుండా యాజమాన్యం, ప్రభుత్వం కాలయాపన చేస్తున్నాయని మండిపడ్డారు. వారానికి ఐదు రోజుల పనిదినాలు, పాత పింఛను విధానం అమలు చేయాలని కోరారు. బ్యాంకుల్లో అవుట్ సోర్సింగ్ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అమలు చేయని పక్షంలో మార్చి 24, 25 తేదీల్లో దేశవ్యాప్తంగా సమ్మె చేస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు జనార్దన్, భాస్కర్, కేశవ రెడ్డి, సుమలత, రేష్మా, నిర్మల, వెంకటలక్ష్మి, మహేష్, యగ్నేష్ బాబు, నందకుమార్, పవన్, శంకర్‌రావు, లక్ష్మీపతి పాల్గొన్నారు.

బ్యాంక్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

జాతీయ బ్యాంక్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని, లేనిపక్షంలో సమ్మె చేయాల్సి వస్తుందని బ్యాంక్ ఆఫీసర్ల సంఘం ప్రధాన కార్యదర్శి జి.కిషోర్ కుమార్ రెడ్డి హెచ్చరించారు. ఈ మేరకు తిలక్‌రోడ్డులోని ఎస్‌బీఐ ఎదుట శుక్రవారం ధర్నా చేశారు. ఆయన మాట్లాడుతూ గత ఏడాది మార్చిలో ఉద్యోగులు సమ్మె చేసిన సమయంలో ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు సమస్యలు పరిష్కరించకుండా కాలయాపన చేస్తోందన్నారు. బ్యాంకుల్లో పనిభారం తగ్గించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో మార్చి 24, 25 తేదీల్లో సమ్మె చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు కె.వి.ఎస్.ఎన్. మూర్తి, టి.వెంకటపతి పాల్గొన్నారు.

'మా హయాంలో టౌన్ బ్యాంక్ అభివృద్ధి'

తిరుపతి (జీవకోన), ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): తమ పాలకవర్గ హయాంలో తిరుపతి టౌన్ బ్యాంక్ అభివృద్ధి సాధించిందని ఛైర్మన్ కేతం జయచంద్రారెడ్డి అన్నారు. తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. 1998లో రుణాలు తీసుకున్న వారి మొండి బకాయిలను రికవరీ చేశామన్నారు. వన్ టైం సెటిల్మెంట్ ఎక్కడా జరగలేదన్నారు. బ్యాంకు కేంద్రంగా రాజకీయాలు చేయొద్దని కోరారు. బ్యాంకు అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. ఈ సమావేశంలో వైస్ ఛైర్మన్ వాసుదేవ యాదవ్, నాగిరెడ్డి, మబ్బు నాదముని రెడ్డి, బ్రహ్మానందరెడ్డి, మాకం చంద్రయ్య, అమర్నాథ్ రెడ్డి, జ్యోతి ప్రకాష్, సురేష్ రెడ్డి, కాసిం, వెంకటేష్ పాల్గొన్నారు.

'ఆ ఆరోపణలు నిరాధారం'

టౌన్ బ్యాంకులోని తన ఛాంబర్‌ను బార్‌లా మార్చేశానని జనసైనికులు చేసిన ఆరోపణలు నిరాధారమైనవని వైస్‌ఛైర్మన్ వాసుదేవ యాదవ్ శుక్రవారం అన్నారు. తనకు తెలియకుండానే మద్యం సీసాలు ఉంచి సోషల్ మీడియాలో ట్రోల్ చేశారని ఆరోపించారు.

మహా కుంభమేళాకు ఆర్టీసీ బస్సు



తిరుపతి(ఆర్టీసీ), ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): మహా కుంభమేళాకు ఆర్టీసీ చివరి బస్సు శుక్రవారం రాత్రి బయలుదేరి వెళ్లింది. సెంట్రల్ బస్టాండులో 36మంది ప్రయాణికులతో సిద్ధమైన సూపర్‌లగ్జరీ బస్సును డీపీటీవో నరసింహులు పచ్చజెండా ఊపి ప్రారంభించారు. ఇప్పటికే 10, 12 తేదీల్లో ఒక్కొక్కటి చొప్పున ఆర్టీసీ బస్సులు మహాకుంభమేళాకు వెళ్లిన విషయం తెలిసిందే. కార్యక్రమంలో డిప్యూటీ సీటీఎం విశ్వనాథం, తిరుపతి డిపో మేనేజర్ బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

మీకు అండగా ఉంటాం

● ఏనుగు దాడిలో మృతిచెందిన రాకేష్ కుటుంబానికి మంత్రి లోకేశ్ భరోసా



చంద్రగిరి, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): ఇటీవల ఏనుగు దాడిలో మృతిచెందిన చంద్రగిరి మండలం మామిడిమానుగడ్డ వాసి, కందులవారిపల్లె పంచాయతీ ఉపసర్పంచ్ రాకేష్‌చౌదరి కుటుంబానికి అండగా ఉంటామని మంత్రి నారా లోకేశ్ భరోసా ఇచ్చారు. రాకేష్ కుటుంబ సభ్యులు శుక్రవారం ఉండవల్లి నివాసంలో మంత్రి నారా లోకేశ్‌ను కలిశారు. పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనే రాకేష్ మృతి చెందడం తనను కలిచివేసిందని లోకేశ్ వారితో అన్నారు. ఆయన మృతి పార్టీకి తీరని లోటన్నారు. రాకేష్ కుటుంబ సభ్యులకు అన్ని విధాలా అండగా ఉంటామన్నారు. వారి కుటుంబ నేపథ్యాన్ని అడిగి తెలుసుకున్నారు.

నేడు ఆర్టీసీ డ్రైవర్లకు నగదు పురస్కారాలు

తిరుపతి(ఆర్టీసీ), ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): రోడ్డు భద్రతా మసోత్సవాల ముగింపు సందర్భంగా శనివారం ఆర్టీసీ తిరుపతి డిపో గ్యారేజీ ఆవరణలో 36 మంది డ్రైవర్లకు ప్రమాద రహిత సర్వీసు నగదు పురస్కారం, ప్రశంసాపత్రాలు అందజేయనున్నారు. ముఖ్య అతిథులుగా ఆర్టీవో మురళీమోహన్, డీపీటీవో నరసింహులు హాజరుకానున్నారు. వీరి చేతుల మీదుగా అత్యధిక ప్రమాద రహిత సర్వీసు గలిగిన జిల్లాస్థాయిలో ముగ్గురిని, డిపో స్థాయిలో 33మంది డ్రైవర్లను సత్కరించనున్నారు.

శ్రీవారిసేవలో ప్రముఖులు

తిరుమల శ్రీవారిని శుక్రవారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో.. కర్ణాటక హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వెంకటేష్ నాయక్, పొద్దుటూరు ఎమ్మెల్యే వరదరాజుల రెడ్డి ఉన్నారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి





జస్టిస్ వెంకటేష్ నాయక్ - వరదరాజుల రెడ్డి

శ్రీవారి సర్వదర్శనానికి 12 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 12 గంటల సమయం పడుతోంది. శుక్రవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లోని 15 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 6 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచిఉన్నారు.

బుధవారం నాటి హుండీ ఆదాయం: రూ.3.77 కోట్లు

గురువారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 60,203

తలనీలాలు సమర్పించినవారు: 21,793



ప్రకృతి ఒడిలో సదాశివుడు


● అటు ఆధ్యాత్మికత..ఇటు ప్రకృతి రమణీయత



వడమాలపేట, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): సహజ సిద్ధమైన జలపాతాలు, కొండ కోనల్లో సదాశివుని ఆలయం ఆధ్యాత్మిక పరిమళాలను వెదజల్లుతోంది. వడమాలపేట సమీపంలోని సదాశివకోనలో వెలసిన ఈ ఆలయం దేవదాయ శాఖ పరిధిలో ఉంది. చుట్టూ ప్రకృతి అందాలు పరుచుకోవడంతో పర్యాటక కేంద్రంగా కూడా ఆలయప్రాంతం భాసిల్లుతోంది. పర్వదినాల్లో సమీప పరిసరాల నుంచే కాదు తమిళనాడు, కర్ణాటక నుంచి భక్తులు సైతం ఇక్కడకు వస్తుంటారు. జలపాతంలో స్నానమాచరించి స్వామివారిని దర్శించుకుంటారు. జలపాత స్నానం చేశాక తడిదుస్తులతో ప్రదక్షిణ చేసి స్వామిని దర్శిస్తే సంతాన ప్రాప్తి కలుగుతుందని దంపతులు విశ్వసిస్తారు. సదాశివకోన సమీపంలోనే కామాక్షి అమ్మవారి కోన ఉంది. మహామునులు పౌర్ణమి అమృత ఘడియల్లో జలపాత స్నానం చేసి గుహ ద్వారా శ్రీకాళహస్తిలోని వాయులింగేశ్వరుడ్ని దర్శించేవారని ఐతిహ్యం. శివరాత్రి, చిత్రాపౌర్ణమి, నవరాత్రులు,పౌర్ణమి తదితర వేడుకలకు భక్తుల తాకిడి ఎక్కువగా ఉంటుంది.

మహాశివరాత్రి ఏర్పాట్లు

శివరాత్రి సందర్భంగా చైర్మన్ జయచంద్రన్ ఆధ్వర్యంలో ఆలయాన్ని సుందరంగా అలంకరిస్తున్నారు. వేకువజామున లింగోద్భవ అభిషేకం అనంతరం సర్వదర్శనానికి భక్తులను అనుమతిస్తారు. సులభ దర్శనం కోసం క్యూలైన్లు ఏర్పాటు చేస్తున్నారు. వ్యయ ప్రయాసలతో చేరుకునే భక్తులకు భోజన వసతి కల్పిసున్నారు. వడమాలపేట, పుత్తూరు, ఏర్పేడు మండలాల అన్నదాన సమాజాలు ఈ సేవలో తరిస్తాయి.





సదాశివకోనలో శివాలయం



సదాశివకోన జలపాతం



అమ్మవారి కోన జలపాతం



రాయలు నాటి శాసనం

సదాశివకోనలో బండమీద క్రీ.శ. 1554 నాటి శాసనం కనిపిస్తుంది. సదాశివకోనలో చెరువు తవ్వించిన అంశం, గుడిమల్లం పరశురామేశ్వరుడికి సంబంధించిన దానం ఈ శాసనంలో లిఖితమై ఉంది. శ్రీవీరప్రతాప వీర సదాశివదేవరాయలు తరఫున స్థానిక అధికారి(కార్యకర్త)గా పనిచేస్తున్న నరసింహ ఈ శాసనాన్ని వేయించారు. పాయల్ సెంటర్‌కి 15 కిలోమీటర్ల దూరంలో అడవిలో అమ్మవారి కోనతో ఒక బండమీద ఈ శాసనం ఉంది. తెలుగులో ఉన్న ఈ శాసనం మీది అక్షరాలు కనుమరుగవుతున్నాయి. దీని విలువ తెలియక రంగులు పూసేస్తున్నారు.

ఆలయానికి ఇలా వెళ్లాలి..

- వడమాలపేటకు సమీపంలో రామసముద్రం బైపాస్ నుంచి ఎనిమిది కిలోమీటర్లు కాలినడక మార్గం
- పుత్తూరు నుంచి బస్సుల ద్వారా నాగిలేరు, అక్కడ నుంచి కోనకు ఆరు కిలోమీటర్లు నడకమార్గం.
- ఏర్పేడు మండలం పాయల్ సెంటర్ నుంచి జీపులు, ట్రాక్టర్లు, మోటర్ బైక్‌ల ద్వారా 12 కిలోమీటర్లు ప్రయాణించాలి.



అమ్మవారి కోన లో బయల్పడిన పురాతన శాసనం

ఐదు రోజుల్లో రుయా రూపురేఖలు మారాలి

● ఆకస్మికంగా తనిఖీ చేసిన కలెక్టర్ వెంకటేశ్వర్

● అత్యవసర విభాగం పనితీరుపై అసంతృప్తి

తిరుపతి(వైద్యం), ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): 'ఆస్పత్రిలో రోగులకు మౌలిక వసతులు కల్పించేది ఇలాగేనా... ఏసీలు పనిచేయడం లేదు.. లైట్లు కూడా వేయకుండా చీకటి గుహను తలపించేలా ఆస్పత్రిని మార్చేశారు.. అత్యవసర విభాగం ఇంత అధ్వానంగా ఉంటే మిగిలిన వాటి పరిస్థితి ఏమిటి' అంటూ కలెక్టర్ వెంకటేశ్వర్ రుయా అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. రుయాస్పత్రిని ఆయన శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. దాదాపు మూడు గంటల సేపు ప్రతి విభాగాన్నీ పరిశీలించి రోగులకు అందుతున్న వైద్య సేవలు, మౌలిక వసతులను పరిశీలించారు. మొదటగా అత్యవసర విభాగాన్ని పరిశీలించారు. కనీసం లైట్లు కూడా వేయకుండా రోగులకు వైద్య సేవలు అందిస్తుండటం, పారిశుధ్య నిర్వహణ సక్రమంగా లేకపోవడంతో అధికారులపై మండిపడ్డారు. వెంటనే అత్యవసర విభాగాన్ని మెరుగుపరిచే విధంగా చర్యలు చేపట్టి ఐదు రోజుల్లో రూపు రేఖలను పూర్తిగా మార్చాలన్నారు. అక్కడి నుంచి ఐసీయూ, ఆర్ఐసీయూ వార్డులను పరిశీలించారు. పనిచేయని ఏసీలు, ఫ్యాన్లు, లైట్లు ఉండకూడదని, విరిగిన మంచాలు, కుర్చీలు, కిటికీలు, తలుపులు వంటివి కూడా ఎక్కడా కనిపించకూడదని అన్నారు. అక్కడి నుంచి ఓపీ కేంద్రానికి వెళుతున్న క్రమంలో పాండూరుకు చెందిన జగ్గయ్య అనే రోగిని వారి కుటుంబ సభ్యులు స్ట్రెచ్చర్‌పై నెట్టుకువెళుతుండటాన్ని గుర్తించారు. రోగులను ఇలాగే గాలికి వదిలేస్తారా.. తీసుకువెళ్లేందుకు సిబ్బంది లేరా అంటూ ఆయన వైద్యులను ప్రశ్నించారు. రోగులను ఇలా వైద్య పరీక్షలకు, ఓపీకి స్ట్రెచ్చర్‌పై తీసుకువెళ్లకుండా అన్నీ ఒకే దగ్గర సమకూర్చే దిశగా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ల్యాబ్‌ను పరిశీలించి, ఏ రోజు పరీక్షల ఫలితాలు అదే రోజు అందించాలని, ఆలస్యం చేస్తే సహించేది లేదని అన్నారు. ఎంఆర్‌పై స్కానింగ్, జనరిక్, మందుల దుకాణాన్ని పరిశీలించారు. నిర్మాణంలో ఉన్న రోగుల సహాయకుల భవనాన్ని పరిశీలించి, త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. సెంట్రల్ డ్రగ్ స్టోర్, న్యూ సిటీ డయాగ్నోస్టిక్ సెంటర్‌ను పరిశీలించారు. ఆస్పత్రిలో ఎక్కడపడితే అక్కడ ఉద్యోగ సంఘాల క్యాలెండర్లు ఉండటంపై అసహనం వ్యక్తం చేస్తూ వాటి స్థానంలో సమాచార పోస్టర్లను అంటించాలన్నారు. కార్యక్రమంలో ప్రత్యేకాధికారి కనకనరసారెడ్డి, రుయా సూపరింటెండెంట్ రవిప్రభు, డీఎంహెచ్‌వో బాలకృష్ణ నాయక్, ఎస్వీ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ చంద్రశేఖరన్, ప్రసూతి ఆస్పత్రి సూపరింటెండెంట్ పార్థసారథిరెడ్డి, సీఎస్ఆర్ఎంవో సుబ్బలక్ష్మమ్మ, ఏఆర్ఎంవో హరికృష్ణ, ఏపీఎంఐసీడీసీ ఈఈ శివరామిరెడ్డి, హెచ్‌డీఎస్ సభ్యులు ఖాజా మొహిద్దీన్, సందీప్ పాల్గొన్నారు.



స్ట్రెచ్చర్‌పై తీసుకువెళుతున్న రోగితో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్వర్

'జిల్లాలో రెవెన్యూ సమస్యల పరిష్కారానికి కసరత్తు చేస్తున్నాం. ఇటీవల నిర్వహించిన రెవెన్యూ సదస్సుల్లో ఇదే విషయమై ప్రధానంగా వినతులు వచ్చాయి. ఇబ్బడిముబ్బడిగా నోషనల్ ఖాతాలోకి వెళ్లిన హక్కుదారుల ఆస్తులకు శాశ్వత పరిష్కారం చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాం' అని తిరుపతి ఆర్డీవో రామ్మోహన్ అన్నారు. ఇంకా పలు విషయాలపై ఆయనతో ఆంధ్రజ్యోతితో మాట్లాడారు.

రెవెన్యూ సమస్యల పరిష్కారానికి కసరత్తు

● తిరుపతి ఆర్డీవో రామ్మోహన్

ఫటా ఫట్



? రెవెన్యూ సదస్సుల్లో ఎలాంటి ఫిర్యాదులొచ్చాయి

! తిరుపతి డివిజన్ పరిధిలో నెల రోజులపాటు నిర్వహించిన రెవెన్యూ సదస్సులను ప్రజలు వినియోగించుకున్నారు. ఎక్కువగా ఆర్వోఆర్ (రికార్డ్ ఆఫ్ రైట్స్) కేసులు వచ్చాయి. అంటే పట్టాదారు పాసు పుస్తకాలు ఆన్‌లైన్లో కావాలని, నిషేధిత జాబితా నుంచి తొలగించాలని, దారిలేక ఇబ్బందులు పడుతున్నామని, సర్వే సమస్యలు వంటివి వచ్చాయి. వాటిని జేసీ లాగిన్‌లో పెట్టాం.

? భూ కబ్జాలపై ఫిర్యాదులు చేశారా

! భూకబ్జా అంటే ఎలాంటి డాక్యుమెంటు లేకుండా వేరొకరి స్థలాన్ని ఆక్రమించుకోవడం. అయితే సదస్సుల్లో వచ్చిన ఫిర్యాదులను పరిశీలిస్తే ఒకే స్థలానికి ఇద్దరు, ముగ్గురు మాదంటే మాదంటూ డాక్యుమెంట్లు తీసుకొస్తున్నారు. అదేవిధంగా కుటుంబ సభ్యులే భాగపరిష్కారం సక్రమంగా చేసుకోని వారు వస్తున్నారు. వీటిని భూకబ్జా అని అనలేం. ఇరువురి డాక్యుమెంట్లను పరిశీలించి, క్షేత్రస్థాయి సందర్శన, సర్వేతో భూ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నాం.

? 22ఏ సమస్యకు పరిష్కారం జరిగేనా

! ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం కాకుండా రెవెన్యూ, దేవదాయ శాఖవారు కొన్ని సర్వే నంబర్లను గ్రామాల వారీగా నిషేధిత జాబితాలో చేర్చుతూ (22ఏ) 2007లో ఆయా పరిధిలోని సబ్ రిజిస్ట్రార్లకు పంపారు. ఆ జాబితాలో పొరబాటున ఎవరి ఆస్తులైన నమోదైవుంటే త్వరలోనే వాటికి విముక్తి కలుగనుంది. గతంలో రిజిస్టరైన ఆస్తులు ఆ తర్వాత కాలేదంటే ప్రధాన కారణం 22ఏ. పట్టాల్యాండ్‌ను పొరబాటునపెట్టినా, మాజీ సైనికుల కోటా కిందనో, 1954 ముందు చుక్కల భూమి ఉన్న కేసుల్లో ఎన్వోసీలు ఇచ్చివుంటే వాటికి త్వరలోనే 22ఏ నుంచి తొలగించేందుకు ఉన్నతాధికారులు కసరత్తు చేస్తున్నారు.

? నోషనల్ ఖాతాలోకి ఇబ్బడిముబ్బడిగా యజమానుల ఆస్తులు వెళ్లడమేంటి

! చంద్రగిరి నియోజకవర్గంలో ఇవి ఎక్కువగా ఉన్నాయి. ముఖ్యంగా పాకాల పరిధిలో కొన్ని గ్రామాలు నోషనల్ ఖాతాలో ఉన్నాయి. ఒక రైతుకు మ్యానువల్‌గా ఉన్నటువంటి 1బీ, అడంగల్‌ను ఆన్‌లైన్ చేయమని 2010-11లో చెప్పారు. చాలా మంది రైతులకు డాక్యుమెంట్ లేకపోవడమో, మ్యుటేషన్ చేసుకోవడంలో లింక్ డాక్యుమెంట్ లేకపోవడం, 1బి అడంగల్ దొరక్కపోవడం వలన టెంపరరీగా ఒక నెంబరు ఇచ్చివుంటారు. అదే నోషనల్ ఖాతా. కానీ భూమి వాళ్ల స్వానుభవంలోనే ఉంటుంది. ఇప్పుడు దానిని రెగ్యులర్ చేయడానికి దరఖాస్తులు వస్తున్నాయి. వాటిని పరిశీలించి, జేసీకి నివేదిక ద్వారా వివరించాం.

? పేరెంట్స్ ప్రొటెక్షన్ చట్టం అమలు ఎలా ఉండనుంది

! ఇది పాతదే. తల్లిదండ్రుల సంరక్షణ చట్టం 2007లో సెక్షన్ 23 ప్రకారం పేరెంట్స్‌ను పట్టించుకోని పిల్లలకు వారు పంచిచ్చిన ఆస్తులను తిరిగి తల్లిదండ్రులకే హక్కులు కల్పించడమే ఈ చట్టం ఉద్దేశం. ఇది తల్లిదండ్రుల సంరక్షణ కోసం తీసుకొచ్చిన చట్టం. ఆదరణకు నోచుకోని తల్లిదండ్రులు ఫిర్యాదు చేస్తే విచారించి ఆ ఆస్తిపై పిల్లల హక్కును రద్దు చేసి, రిజిస్ట్రేషన్ హక్కులు కూడా మార్చి వారికి అప్పజెబుతాం. తల్లిదండ్రులను చూడాల్సిన బాధ్యత పిల్లలపై ఉంది.

? డివిజన్లో ఇసుక పాలసీ ఎలా నడుస్తోంది

! స్థానిక అవసరాలకు వాగులు, వంకలు, చెరువుల్లో దొరికే ఇసుక వాడుకోవచ్చు. మిషనరీ, టిప్పర్లు పెట్టి అడ్డగోలుగా దోచుకునేందుకు అనుమతి లేదు. ఇసుక తీసుకెళ్లేవారు పర్మిట్ తీసుకోవాల్సి ఉంటుంది. తిరుపతి డివిజన్‌కు సంబంధించి అవిలాల, కాటన్‌మిల్లు ప్రాంతంలో స్టాక్ పాయింట్లు ఉన్నాయి. అక్కడ కొనుగోలు చేసి తీసుకెళ్లవచ్చు.

- తిరుపతి, ఆంధ్రజ్యోతి

ఔటర్ రింగురోడ్డు టూ పాపవినాశనం

● రూ.40కోట్లతో నాలుగు లేన్ల రహదారి

తిరుమల, ఫిబ్రవరి14(ఆంధ్రజ్యోతి): తిరుమలలో ట్రాఫిక్ సమస్యలు తగ్గించేందుకు రూ.40 కోట్ల తో ఔటర్‌రింగు రోడ్డు నుంచి పాపవినాశనంకు నాలుగులైన్ల రోడ్డు నిర్మాణానికి టీటీడీ పూనుకుంది. పాపవినాశనం తీర్థం, ఆకాశగంగ, జపాలి ఆంజనేయస్వామి ఆలయం, వేణుగోపాల స్వామి ఆలయాలకు వెళ్లాలంటే నందకం సర్కిల్ లేదా అక్టోపస్ భవనం ముందు నుంచి గోగర్భం డ్యాం మీదుగా వెళ్లాలి. గోగర్భం డ్యాం నుంచి పాపవినాశనం వరకు రెండులైన్ల రోడ్డు మాత్రమే ఉండటంతో వాహనాల రాకపోకలు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. విశేష పర్వదినాలు, వారాంతాల్లో సర్వదర్శన క్యూలైన్ అక్టోపస్ సర్కిల్ దాకా వ్యాపిస్తోంది. దీంతో వాహనాల రాకపోకలతో సమస్యలు వస్తున్నాయి. ఇందుకు పరిష్కారంగా నాలుగు లేన్ల రహదారిని ప్రతిపాదించారు.

తొలి దశలో..

తొలిదశలో వాహనాలు గోగర్భం డ్యాం మీదుగా వెళ్లే అవసరం లేకుండా ఔటర్ రింగ్‌రోడ్డు నుంచి క్షేత్రపాలకుని ఆలయం మీదుగా మఠాలు, డంపింగ్‌యార్డు, నేపాలి చెక్‌పోస్టుకు చేరుకునేలా రోడ్డు నిర్మాణం పనులు మొదలు పెట్టారు. ఔటర్ రింగు రోడ్డు నుంచి మఠాల వరకు పాచికాల్వ ఉండటంతో వంతెన నిర్మించనున్నారు.

రెండో దశలో..

నేపాలి చెక్‌పోస్టు నుంచి ఆకాశగంగ వరకు ప్రస్తుతమున్న రెండు లైన్ల రోడ్డును నాలుగులైన్ల రోడ్డుగా విస్తరించే పనుల్లో భాగంగా రోడ్డుకు ఇరువైపుల ఉన్న చెట్లను తొలగించి సర్వే చేస్తున్నారు. ఆకాశగంగ నుంచి అటవీ భూములు కావడంతో అనుమతులు కోరారు.



పాపవినాశన మార్గంలోని పార్వేటమండపం వద్ద రోడ్డు విస్తరణకు జరుగుతున్న సర్వే

పోలీసులమని చెప్పి నగలు ఎత్తుకెళ్లారు

భాకరాపేట, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): పోలీసులమని మాయ మాటలు చెప్పిన గుర్తు తెలియని వ్యక్తులు ఓ జంట వద్ద బంగారు నగలు ఎత్తుకెళ్లిపోయిన ఘటన శుక్రవారం చిన్నగొట్టిగల్లు మండలంలో చోటుచేసుకుంది. భాకరాపేట ఎస్ఐ రాఘవేంద్ర కథనం మేరకు.. రొంపిచెర్ల మండలం గెర్లపల్లెకు చెందిన సుబ్రహ్మణ్యం శెట్టి భార్య భారతితో కలిసి ద్విచక్ర వాహనంలో చిన్నగొట్టిగల్లు ప్రభుత్వాస్పత్రిలో చికిత్స చేయించుకుని స్వగ్రామానికి తిరుగు ప్రయాణమయ్యారు. మార్గమధ్యంలో ఎండపల్లెవారిపల్లె వద్దనున్న పెట్రోలు బంకు వద్ద వాహనాన్ని ఆపిన కొంతమంది తాము పోలీసులమని, బంగారు నగలు వేసుకుని ద్విచక్ర వాహనంలో తిరగడం ప్రమాదకరమని, నగలను తీసి భద్రంగా పెట్టుకోవాలని సూచిస్తూ ఒక పేపరు అందించారు. సుబ్రహ్మణ్యం శెట్టి తన చేతిలోని ఉంగరం, భార్య మెడలో ఉన్న బంగారు చైనును ఆ పేపర్‌లో చుట్టి పెట్రోలు ట్యాంకు కవర్‌లో పెట్టుకుంటూ ఉండగా తామే పొట్లం కట్టి ఇస్తామని తీసుకున్నారు. ఆ పొట్లాన్ని ట్యాంకు కవర్‌లో పెట్టినట్లు నటించి అక్కడి నుంచి వెళ్లిపోయారు. వారు వెళ్లిపోయిన తర్వాత ట్యాంకు కవరును పరిశీలించిన సుబ్రహ్మణ్యం శెట్టి తాము మోసపోయినట్లు గ్రహించి భాకరాపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. 34 గ్రాముల బంగారు ఆభరణాలను ఎత్తుకెళ్లినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. భాకరాపేట పోలీసులు సీసీ ఫుటేజీ ఆధారంగా కేసు దర్యాప్తు చేస్తున్నారు.

లక్ష్మీరెడ్డిపై కేసు నమోదు

తిరుపతి(నేరవిభాగం), ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): జనసేన నేత కిరణ్‌రాయల్ ఫిర్యాదు మేరకు లక్ష్మీరెడ్డిపై తిరుపతి రూరల్ పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది. రూరల్ సీఐ చిన్నగోవిందు తెలిపిన ప్రకారం.. తన ఫొటోలను లక్ష్మీరెడ్డి, వైసీపీ నేత పసుపులేటి సురేష్ మార్ఫింగ్ చేశారని కిరణ్‌రాయల్ ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. లక్ష్మికి ఇవ్వాల్సిన రూ.35 లక్షలు ఇచ్చినా, మరో రూ.90 లక్షలు ఇవ్వాలని లేకపోతే పరువు తీస్తానని బెదిరిస్తోందంటూ కిరణ్‌రాయల్ ఫిర్యాదు చేశారు. దీనిపై సెక్షన్లు 308,(3), 351(2)తో పాటు బీఎన్ఎస్ యాక్టు 66(డి) ఐటీ యాక్టు కింద కేసు నమోదు చేశారు.

ఆర్టీసీలో డ్రైవర్ల కొరత



ఆర్టీసీ అధికారులతో సమీక్షిస్తున్న డీపీటీవో నరసింహులు

తిరుపతి(ఆర్టీసీ), ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఏపీఎస్ ఆర్టీసీ డ్రైవర్ల కొరత తీవ్రంగా కనిపిస్తోంది. ఉన్న వారిలోనూ పలువురు సెలవు పెడుతుండడంతో పూర్తిస్థాయిలో బస్సులు రోడ్డెక్కే పరిస్థితి ఉండడం లేదు. ఈ క్రమంలో అధికారులు ప్రత్యామ్నాయంపై దృష్టి సారించారు. తక్షణ చర్యలలో భాగంగా ఆన్‌కాల్ డ్రైవర్ల ద్వారా గట్టెక్కేందుకు ప్రయత్నిస్తున్నారు. ఆయా డిపో మేనేజర్ల పరిధిలో ఆన్‌కాల్ డ్రైవర్ల నియామకానికి దరఖాస్తు చేసుకోవాలని డీపీటీవో జి.నరసింహులు ఔత్సాహికులను కోరారు. శిక్షణ ఇచ్చి, సర్టిఫికెట్స్, ఫిట్‌నెస్‌లలో పాసైన డ్రైవర్లను వెంటనే విధుల్లోకి తీసుకునేలా చర్యలు చేపట్టాలని ఆయన అధికారులను ఆదేశించారు.

300మంది ఆన్‌కాల్ డ్రైవర్లకు అవకాశం

జిల్లాలోని 11డిపోల పరిధిలో ఆర్టీసీ సొంత బస్సులు 726 ఉన్నాయి. వీటిని సజావుగా నడపాలంటే 1,830మంది డ్రైవర్లు అవసరం. ప్రస్తుతం అందుబాటులో ఉన్న డ్రైవర్లు 1,701మంది. 129మంది తక్కువగా ఉన్నారు. అంతేకాకుండా అందుబాటులో ఉన్న డ్రైవర్లు కూడా అనివార్య కారణాలతో సెలవు పెడుతున్నారు. ప్రస్తుతం బస్సులన్నీ రోడ్డెక్కాలంటే 300మంది ఆన్‌కాల్ డ్రైవర్లు అవసరం. ఇప్పట్లో శాశ్వత డ్రైవర్ల నియామకాలు కనిపించడం లేదు కాబట్టి ఆన్‌కాల్ డ్రైవర్ల ఏర్పాటుకు రంగం సిద్ధమైంది. 2014 తర్వాత ఆర్టీసీ డ్రైవర్ల నియామకం జరగలేదు. గడిచిన పదేళ్లలో డ్రైవర్ల ఉద్యోగ విరమణ, ఇతర కారణాలతో ఖాళీల సంఖ్య క్రమేణా పెరుగుతోంది.

బుక్‌స్టాల్‌పై దాడి కేసులో నిందితుల అరెస్టు

తిరుపతి(నేరవిభాగం)ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): తిరుపతి పుస్తక ప్రదర్శనలో విశాలాంధ్ర బుక్ స్టాల్‌పై దాడి ఘటనలో ముగ్గురు నిందితులను అరెస్టు చేసి 41 నోటీసు ఇచ్చినట్లు అలిపిరి సీఐ నాగార్జునరెడ్డి శుక్రవారం చెప్పారు. 41 నోటీసు ఇచ్చిన వారిలో తుమ్మల ఓంకార్, కిరణ్‌కుమార్, సురేష్‌నాయక్ ఉన్నారన్నారు. వీరితో పాటు దాడిలో పాల్గొన్న రమేష్‌బాబు, మరో నలుగురి కోసం గాలిస్తున్నారు.

ఎర్రచందనం నిందితుడికి ఐదేళ్ల జైలు

● రూ.ఆరు లక్షల జరిమానా విధించిన న్యాయమూర్తి

తిరుపతి(నేరవిభాగం), ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): ఎర్రచందనం అక్రమ రవాణా కేసులో నిందితుడికి ఐదేళ్ల జైలు శిక్ష.. రూ 6 లక్షల జరిమానా విధిస్తూ శుక్రవారం తిరుపతి ఎర్రచందనం అదనపు జిల్లా న్యాయమూర్తి నరసింహమూర్తి తీర్పు చెప్పారు. వివరాలిలా ఉన్నాయి. తమిళనాడు విల్లుపురం జిల్లాకు చెందిన జయపాల్‌ను ముంగిలిపట్టు బీటు పరిధిలో ఎర్రచందనం అక్రమ రవాణాకు పాల్పడుతుండగా గతంలో టాస్క్‌ఫోర్సు పోలీసులు అరెస్టు చేశారు. దీనికి సంబంధించి నేరం రుజువు కావడంతో నిందితుడికి ఐదేళ్ల జైలు శిక్ష, రూ ఆరు లక్షల జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు. అనంతరం నిందితుడ్ని నెల్లూరు సెంట్రల్ జైలుకు తరలించారు.

18న దక్షిణాది రాష్ట్రాల డీజీపీల సమావేశం

తిరుపతి(నేరవిభాగం), ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): దేశంలో తీవ్రవాదం, నక్సలిజాన్ని సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు తీసుకోవాల్సిన చర్యలపై సమీక్షించి, అవసరమైన నిర్ణయాలు తీసుకోవడానికి వీలుగా ఈ నెల 18న తిరుపతి కేంద్రంగా దక్షిణాది రాష్ట్రాల డీజీపీల సమావేశం నిర్వహించనున్నారు. తమిళనాడు, ఆంధ్ర, తెలంగాణా, కేరళ, కర్ణాటక రాష్ట్రాలకు చెందిన డీజీపీలు, ఉన్నత స్థాయి అధికారులు హాజరుకానున్నారు. సంవత్సరానికి రెండుసార్లు జరిగే సమన్వయ కమిటీ సమావేశం ఈసారి తిరుపతి వేదికగా జరగనుంది. గతంలో 2021 నవంబరు 14న తిరుపతిలో ఈ సమావేశం జరిగింది.

పుత్తూరు వార్తలు

మౌలిక వసతులకు దూరంగా జగనన్న కాలనీ



ముళ్ల పొదలతో కాలనీ రోడ్డు

వడమాలపేట, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని అప్పలాయగుంట రోడ్డుకు సమీపంలోని జగనన్న కాలనీ మౌలిక వసతులకు ఆమడదూరంలో ఉంది. ఇరుకు రోడ్లకు తోడు ముళ్ల పొదలతో స్థానికులు ఇబ్బంది పడుతున్నారు. కాలనీలో సుమారు 950 మందికి పట్టాలు అందజేశారు. వీటిలో సుమారు 340 ఇళ్లు పూర్తయ్యాయి. కాగా పలు రోడ్లలో ముళ్ల కంపలు పెరిగి రాకపోకలకు ఇబ్బందిగా ఉంది. మురుగు నీటి కాలువలు నిర్మించకపోవడంతో దుర్గంధంతో స్థానికులు అల్లాడిపోతున్నారు. మిట్ట ప్రాంతం కావడం, రోడ్లు ఎగుడు దిగుడుగా ఉండడంతో ప్రయాణం ఇబ్బందిగా మారింది. కాలనీలో ఇళ్ల నిర్మించుకునే వారి తమ అవసరాల కోసం రోడ్లను చదను చేసుకుంటున్నారు. ఇప్పటికైనా సంబంధిత శాఖల అధికారులు మౌలిక వసతుల కల్పించాలని కాలనీవాసులు కోరుతున్నారు.

రూ.1.20 కోట్ల తుడా నిధులతో పుత్తూరులో అభివృద్ధి పనులు

పుత్తూరు అర్బన్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): పుత్తూరు మున్సిపాలిటీ పరిధిలో రూ.1.20 కోట్ల తుడా నిధులతో అభివృద్ధి పనులు చేపట్టనున్నారు. ఇటీవల ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ విజ్ఞప్తి మేరకు తుడా నిధుల కేటాయింపు జరిగింది. మున్సిపాలిటీ పరిధిలోని చెర్లోపల్లిలో సిమెంటు రోడ్డుతో పాటు పట్టణంలో మురుగునీటి కాలువలను నిర్మించనున్నారు.

సీవేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్

మురుగునీటి శుద్ధి కర్మాగారం(సీవేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్) ఏర్పాటుకు పుత్తూరు పరిధిలో చర్యలు చేపట్టారు. అవసరమైన భూమి కోసం సర్వే నిర్వహించారు. తిరుపతి ఆర్డీవో పరిశీలించారు. భూ సేకరణకు అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేశారు. మూడు ప్రాంతాల్లో మురుగునీటి శుద్ధి కేంద్రాలు ఏర్పాటుకు ప్రణాళికలు రూపొందించారు. రూ.13 కోట్లతో టెండర్లు ఆహ్వానించనున్నారు. చివరకు ఆ ప్రణాళికలు రద్దైనట్టు ఉన్నతాధికారులు పేర్కొన్నారు. మూడు ప్రాంతాల్లో ప్లాంట్లు ఏర్పాటు కాకుండా ఒకే చోట పట్టణంలోని మురుగును తీసుకొచ్చి శుద్ధి చేసే విధంగా ప్రణాళిక సిద్ధం చేయనున్నట్లు తెలుస్తోంది. ఏది ఏమైనా పట్టణంలో మురుగు శుద్ధి చేసే ప్రక్రియ ఎప్పటికి నోచుకుంటుందో వేచి చూడాల్సిందే.

భక్తిశ్రద్ధలతో అగ్నిగుండ ప్రవేశం



పుత్తూరు టౌన్, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కేఎన్ రోడ్డులో కొలువైన్న కావమ్మ, మారయ్య ఆలయంలో తిరునాళ్లలో శుక్రవారం భక్తులు అగ్నిగుండ ప్రవేశం ఘనంగా జరిగింది. ఉదయం కావమ్మ, మారయ్యకు ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. మధ్యాహ్నం మహిళా భక్తులు పొంగళ్లు పెట్టారు. రాత్రి కావమ్మ, మారయ్య పురవిహారం చేశారు. రాత్రి అగ్నిగుండ ప్రవేశాన్ని భక్తులు భక్తిశ్రద్ధలతో నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు.

రహదారి నియమాలు పాటించండి



రోడ్డు భద్రత అవగాహన సదస్సులో మాట్లాడుతున్న చంద్రమౌళి

పుత్తూరు, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): జీవన పోరాటంలో ప్రయాణాలు తప్పని సరైనా రహదారి నియమాలు పాటించి విలువైన ప్రాణాలు కాపాడుకోవాలని పుత్తూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ చంద్రమౌళి అన్నారు. కళాశాలలో రోడ్డు భద్రతపై శుక్రవారం విద్యార్థులకు అవగాహన కల్పించారు. ముఖ్య అతిథి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ సురేంద్ర నాయుడు మాట్లాడుతూ నిబంధనలు పాటించని వాహదారులపై కఠిన చర్యలతో పాటు అధిక మొత్తంలో జరిమానా వసూలు చేస్తామన్నారు. అధ్యాపకులు కోటేశ్వరయ్య, వీరయ్య, బాబురావు పాల్గొన్నారు.

ఆరోపణలను ఖండిస్తున్నాం

పిచ్చాటూరు, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): సామాజిక మాధ్యమాల్లో ఎమ్మెల్యే ఆదిమూలంపై వచ్చిన అసభ్యకర, నిరాధార ఆరోపణలను ఖండిస్తున్నట్టు పిచ్చాటూరుకు ఉపాధ్యాయులు, ప్రభుత్వ ఉద్యోగులు చెప్పారు. గౌరవప్రదంగా ఉద్యోగాలు చేసుకుంటున్న తమ వ్యక్తిత్వాల్ని హననం చేసే విధంగా వచ్చిన వార్తలను ఖండిస్తున్నట్టు చెప్పారు. మండల విద్యా వనరుల కేంద్రం వద్ద వారు మాట్లాడుతూ ఈ విషయాల్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లనున్నట్టు పేర్కొన్నారు. మహిళా ఉద్యోగులు, అధికారులు, గృహిణిల ప్రతిష్ఠ దిగజార్చే విధంగా వార్తలను సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకుని, తెరవెనుక నుంచి నాటకాలు ఆడుతున్న వారిని ప్రజల ముందు నిలపాలని కోరారు.

వేడుకగా పద్మావతమ్మ ఊంజలసేవ



నారాయణవనం, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): నారాయణ వనంలో కొలువై ఉన్న కల్యాణ వెంకన్న ఆలయంలో పద్మావతి అమ్మవారి ఊంజల సేవను శుక్రవారం వేడుకగా నిర్వహించారు. ఉదయం స్వామిఅమ్మవార్లకు శుక్రవారం సందర్భంగా నిత్య కైంకర్యాలు, ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. సాయంత్రం అమ్మవారిని నూతన పట్టువస్త్రాలు, ప్రత్యేక పుష్పాలతో అలంకరించి, వేద పండితుల మంత్రోచ్చారణల నడుమ ఊంజల సేవను నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు శ్రీధర్ భట్టాచార్య, శ్రీనివాసరాఘవ భట్టాచార్య పాల్గొనగా ఆలయాధికారి నాగరాజు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ఘనంగా శుక్రవార ఉత్సవం



శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయంలో శుక్రవారం అమ్మవారికి విశేష ఉత్సవం నిర్వహించారు. సాయంత్రం అమ్మవారి ఉత్సవమూర్తిని విశేషంగా అలంకరించి ప్రత్యేక హారతులు సమర్పించారు. అనంతరం ఆలయంలో ప్రాకారోత్సవం నిర్వహించారు. భక్తులు శుక్రవారం ఉత్సవంలో అమ్మవారిని దర్శించుకున్నారు.

గూడూరు

సూళ్లూరుపేట/వెంకటగిరి

నేడు టీడీపీ కార్యాలయంలో గ్రీవెన్స్ డే

నాయుడుపేట టౌన్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేట పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో శనివారం గ్రీవెన్స్ డే నిర్వహించనున్నట్లు సూళ్లూరుపేట ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ తెలిపారు. ఉదయం 10గంటల నుంచి అర్జీలు స్వీకరిస్తామని, నియోజకవర్గంలోని అన్ని మండలాల ప్రజలు తమ సమస్యల విన్నవించవచ్చని చెప్పారు.

15 నుంచి నీలకంఠాలయ కుంభాభిషేకం

నాయుడుపేట టౌన్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేట - తుమ్మూరులో వెలసిన గంగా కామాక్షీదేవి సమేత నీలకంఠేశ్వరస్వామి ఆలయంలో ఈ నెల 15 నుంచి జీర్ణోద్ధరణ, అష్టబంధన, మహా కుంభాభిషేకాలు నిర్వహించనున్నట్లు ఈవో తెలిపారు.

పన్నులను సకాలంలో చెల్లించాలి

గూడూరు అర్బన్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): పట్టణ ప్రజలు పన్నులను సకాలంలో చెల్లించి మున్సిపాలిటీ అభివృద్ధికి సహకరించాలని కమిషనర్ వెంకటేశ్వర్లు కోరారు. 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి మున్సిపాలిటీ పరిధిలోని ఆస్తి, కొళాయి, ఖాళీ స్థలాలు, ట్రేడ్ లైసెన్స్ పన్నులను సకాలంలో చెల్లించాలని కోరారు.

16న హ్యాండ్‌బాల్ జట్టు ఎంపిక

చిల్లకూరు, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): స్థానిక డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకులంలో ఈనెల 16వ తేదీన రాష్ట్రస్థాయి జూనియర్ బాలుర హ్యాండ్‌బాల్ పోటీలకు ఉమ్మడి నెల్లూరు జిల్లా జట్టును ఎంపిక చేయనున్నట్లు హ్యాండ్‌బాల్ అసోసియేషన్ సెక్రటరీ పీడీ శ్రీరేష్ తెలిపారు. వివరాలకు 9704827095 నంబరును సంప్రదించాలన్నారు.



గొర్రెపల్లిగుంట ప్రధాన రహదారి - కాలనీలో అధ్వానంగా ఉన్న వీధి

అభివృద్ధికి ఆమడ దూరంలో గొర్రపల్లిగుంట గిరిజనకాలనీ

నాయుడుపేట టౌన్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేట పట్టణ కేంద్రానికి కూతవేటు దూరం... మండలంలో మేజర్ పంచాయతీ అయిన పుదూరులో ఉన్న గొర్రెపల్లిగుంట కాలనీలోని గిరిపుత్రులు సమస్యల లోగిళ్లలో జీవనం సాగిస్తున్నారు. గొర్రెపల్లిగుంట కాలనీలో 100 గిరిజన కుటుంబాలు ఉన్నారు. ఎస్టీ గ్రాంట్ కింద మంజూరైనా రెండు సిమెంట్ రోడ్లు తప్పితే కాలనీలో వీధులన్నీ మట్టిరోడ్లతో దర్శన మిస్తున్నాయి. చినుకుపడితే చిత్తడిగా ఉండే ఆ రోడ్లపై రాకపోకలు సాగించేందుకు గిరిపుత్రులు సర్కస్ ఫీట్లు చేయాల్సి వస్తోంది. ముఖ్యంగా అనారోగ్యం భారిన పడిన వృద్ధులను, గర్భిణులను ఆస్పత్రు లకు తీసుకువెళ్లాలన్నా నానాపట్లు పడుతున్నారు. డ్రైనేజీ కాలువలు లేకపోవడంతో పరిసరాలు అపరిశుభ్రంగా ఉన్నాయి. కాలనీలో రక్షిత మంచినీటి పథకం లేకపోవడంతో బావి నీరే జీవనాధారం. 2014లో అప్పటి టీడీపీ ప్రభుత్వంలో సీపీడబ్ల్యూఎస్ స్కీమ్ ద్వారా నాయుడు పేట నుంచి గొర్రెపల్లిగుంట కాలనీకి తాగునీరును సరఫరా చేసేందుకు పైపులైన్‌లు ఏర్పాటు చేశారు. ప్రస్తుతం పైపులైన్‌లు మరమ్మతులకు గురికావడంతో నీటి సరఫరా ఆగిపోయింది. దీంతో కాలనీ సమీపంలో ఉన్న బావి నుంచి మరో పైపులైన్ వేసి నీరందిస్తున్నారు. ఆ నీరు రంగుమారడంతో తాగలేక ఇబ్బందులు పడుతున్నామని గిరిజనులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాలనీ ప్రధాన రహదారిని సిమెంట్ రోడ్డుగా మార్చడంతో పాటు డ్రైనేజీ కాలువలు నిర్మించాలని, తాగునీటి సమస్య పరిష్కరించాలని గిరిపుత్రులు కోరుతున్నారు.



నిరుపయోగంగా ఉన్న తాగునీటి ట్యాంక్



దుస్థితిలో తహసీల్దార్ కార్యాలయం - దెబ్బతిన్న స్తంభం

శిథిలావస్థలో ప్రభుత్వ కార్యాలయాల భవనాలు

బిక్కుబిక్కుమంటున్న సిబ్బంది

బాలాయపల్లి, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు ప్రభుత్వ కార్యాలయాల భవనాలు శిథిలావస్థకు చేరుకున్నాయి. ప్రధానంగా తహసీల్దార్ కార్యాలయం, పశువైద్యశాల భవనాలు కూలిపోయే స్థితిలో ఉన్నాయి. గత వైసీపీ ప్రభుత్వం సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, గ్రామీణ ఆరోగ్య కేంద్రాల భవన నిర్మాణాలపై పెట్టిన శ్రద్ధ దుస్థితికి చేరుకున్న కార్యాలయాలపై చూపలేదు. రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దారు గది, వరండాలో పైకప్పు తరచూ పెచ్చులూడి పడుతోంది. దీంతో పక్కనే ఉన్న కమ్యూనిటీ భవనంలోకి తహసీల్దారు కార్యాలయాన్ని తాత్కాలికంగా మార్చారు. అయితే ఆ భవనం ఇరుకుగా ఉండడంతో ఆర్ఐ, సర్వేయర్, వీఆర్వోలు శిథిలావస్థకు చేరిన భవనంలో విధులు నిర్వహిస్తున్నారు. ఇప్పటికే పలుమార్లు కార్యాలయంలో పైకప్పు పెచ్చులూడి పడడంతో ఎప్పుడు ఎలాంటి ప్రమాదం జరుగుతుందోనని కార్యాలయానికి వచ్చే ప్రజలతో పాటు సిబ్బంది భయాందోళన చెందుతున్నారు. అలాగే పశువైద్యశాల పురాతనమైన భవనం కావడంతో దుస్థితికి చేరుకుని కూలేస్థితిలో ఉంది. పాడిరైతులు పశువులను తీసుకుని పశు వైద్యశాలకు రావాలంటే భయపడుతున్నారు. చిన్నపాటి వర్షం వచ్చినా భవనం ఉరుస్తూ లోపలికి నీళ్లు వస్తుండడంతో సామగ్రి తడిసి ముద్దవుతోందని సిబ్బంది వాపోతున్నారు. ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి దుస్థితిలో ఉన్న ప్రభుత్వ భవనాల స్థానంలో కొత్తవి నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.

నేడు ఉచిత కంటి పరీక్ష శిబిరం

దొరవారిసత్రం, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని శ్రీనివాసపురంలో ఉన్న వాసమ్మ ఆశ్రమంలో శనివారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు అరవింద ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత కంటి పరీక్ష శిబిరం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

వాటర్ ప్లాంటు ప్రారంభం

చిల్లకూరు, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఏరూరు గ్రామంలో శుక్రవారం గ్రామానికి చెందిన అఖిల్‌రెడ్డి జ్ఞాపకార్థం సుధీర్‌రెడ్డి సహకారంతో ఉచిత మినరల్ వాటర్ ప్లాంటును ప్రారంభించారు. గ్రామస్తులకు శుద్ధనీటిని ఉచితంగా అందించాలని తమ కుమారుడు జ్ఞాపకార్థం ఆర్వోప్లాంటును ఏర్పాటు చేశామని సుధీర్ రెడ్డి తెలిపారు.

సంజీవయ్య సేవలు చిరస్మరణీయం



సంజీవయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎంపీపీ ధనలక్ష్మి, ఎంపీడీవో సురేష్‌బాబు తదితరులు

నాయుడుపేట, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): మాజీ ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్య సేవలు చిరస్మరణీయమని ఎంపీపీ కురుగొండ ధనలక్ష్మి అన్నారు. నాయుడుపేట మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం దామోదరం సంజీవయ్య జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి ఎంపీపీతో పాటు ఎంపీడీవో సురేష్‌బాబు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సిబ్బంది ఆనంద్, రవికుమార్, సత్యనారాయణ, కృష్ణమాంబ తదితరులు పాల్గొన్నారు.

మంచినీటి సమస్యపై దృష్టి పెట్టండి

చిట్టమూరు, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): వేసవికిలో తాగునీటి సమస్య తలెత్తకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని ఎంపీపీ విజయలక్ష్మి అన్నారు. శుక్రవారం ఎంపీడీవో మనోహర్ గౌడ్ ఆధ్వర్యంలో ఎంపీపీ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. మండలంలోని తాగునీటి ఎద్దడి ఏర్పడే గ్రామాలను గుర్తించి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దారు విజయలక్ష్మి, జట్పీటీసీ సభ్యుడు వెంకటయ్య పాల్గొన్నారు.

మద్యం బాటిళ్ల స్వాధీనం



నిందితుడితో ఎక్సైజ్ సీఐ ప్రసాద్, సిబ్బంది

కోట, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కర్లపూడిలో బెల్టుషాపుపై ఎక్సైజ్ పోలీసులు శుక్రవారం దాడులు నిర్వహించారు. 11 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకుని, బెల్టుషాపు నిర్వాహకుడు ప్రభాకర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎక్సైజ్ సీఐ ప్రసాద్ తెలిపారు.

పుల్వామా అమర వీరులకు నివాళి



ర్యాలీ చేస్తున్న విద్యార్థులు, అధ్యాపకులు

కోట, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): పుల్వామా దాడిలో వీరమరణం పొందిన జవాన్‌లకు శుక్రవారం ఎన్‌బీకేఆర్ ఇంజనీరింగ్ విద్యార్థులు నివాళులర్పించారు. కళాశాల డైరెక్టర్ డాక్టర్ విజయకుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎన్‌సీసీ క్యాడెట్లు, విద్యార్థులు కళాశాల నుంచి విద్యానగర్ గాంధీబొమ్మ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు.

రీ సర్వేపై సమీక్ష



సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దారు జయజయరావు, డివిజనల్ సర్వే ఇన్‌స్పెక్టర్ సుబ్బరాయుడు


కోట, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): మండలంలో రీ సర్వేపై విలేజ్ సర్వేయర్లతో శుక్రవారం సమీక్ష జరిగింది. తహసీల్దారు జయజయరావు, డివిజనల్ సర్వే ఇన్‌స్పెక్టర్ సుబ్బరాయుడు మాట్లాడుతూ ప్రభుత్వం ఒక్కొక్క మండలానికి ఒక్కో రెవెన్యూ గ్రామాన్ని మోడల్ విలేజ్‌గా ఎంచుకుని రీ సర్వే చేయడం జరుగుతుందన్నారు. కోట మండలంలో అల్లంపాడు గ్రామాన్ని మోడల్ విలేజ్‌గా ఎంచుకొని సర్వే చేస్తున్నామని చెప్పారు. ఆ గ్రామంలో రైతుల భూములను సమగ్రంగా సర్వే నిర్వహించడం జరుగుతుందన్నారు.

సీఎం చంద్రబాబుకు కల్లుగీత కార్మికుల ధన్యవాదాలు

గూడూరు అర్బన్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు కల్లుగీత కార్మికులకు మద్యం దుకాణాల మంజూరులో పది శాతం రిజర్వేషన్ కేటాయించి అమలు పరిచిన సీఎం చంద్రబాబుకు జిల్లా గౌడ సంక్షేమ సంఘ నాయకులు శుక్రవారం ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో రాజశేఖర్, నారాయణస్వామి, మోహన్, పురుషోత్తం, శ్రీనివాసులు, శ్రీరాములు, అంకయ్య, రవీంద్రరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తానంకి నానాజీకి సైకత శుభాకాంక్షలు

చిల్లకూరు, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): టీడీపీ సీనియర్ నేత, పెంచలకోన ఆలయ మాజీ చైర్మన్ తానంకి నానాజీ పుట్టినరోజును పురస్కరించుకుని చిల్లకూరు మండలంలోని ఏరూరు గ్రామానికి చెందిన సైకతశిల్పి మంచాల సనత్‌కుమార్ శుక్రవారం గ్రామంలో నానాజీ సైకత శిల్పాన్ని రూపొందించి శుభాకాంక్షలు తెలిపారు.



గురుకుల ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

డక్కిలి, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): డక్కిలిలోని బాలయోగి బాలకల గురుకుల పాఠశాలలో 5వ తరగతి, ఇంటర్మీడియట్‌లో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ నాగమణి తెలిపారు. విద్యార్థులు మార్చి 6వ తేదీ లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఏప్రిల్ 6వ తేదీ ఉదయం 5వ తరగతికి, మధ్యాహ్నం ఇంటర్మీడియాట్ విద్యార్థులకు ప్రవేశ పరీక్ష ఉంటుందని చెప్పారు.

చికిత్స పొందుతూ కార్మికుడి మృతి

పెళ్లకూరు, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెన్నేపల్లిలోని ఎంఎస్ అగర్వాల్ స్టీల్ పరిశ్రమలో పనిచేస్తున్న కార్మికుడు చికిత్స పొందుతూ గురువారం సాయంత్రం మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు... జనవరి 1న ఎంఎస్ అగర్వాల్ స్టీల్ పరిశ్రమలో బాయిలర్ పేలిన ఒకరు మృతి చెందగా ఆరుగురు గాయపడ్డారు. క్షతగాత్రులకు చెన్నైలోని కీలపాకం ఆస్పత్రిలో చికిత్స అందించారు. తీవ్రంగా గాయపడిన ఉత్తరప్రదేశ్ రాష్ట్రం రాంపూర్‌కు చెందిన సోను మహమ్మద్ (27) గురువారం సాయంత్రం ఆస్పత్రిలో మృతి చెందాడని, పోస్టుమార్టం అనంతరం మృత దేహాన్ని బంధువులకు అప్పగించినట్లు ఎస్ఐ నాగరాజు తెలిపారు.

అమరవీరుల త్యాగాలను గుర్తించుకోవాలి



అమరవీరుల చిత్రపటాలకు బీజేవైఎం నాయకులు, విద్యార్థుల నివాళి

గూడూరు, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): శత్రువుల నుంచి దేశాన్ని కాపాడేందుకు ప్రాణాలను పణంగా పెట్టి అమరులైన సైనికుల త్యాగాలను గుర్తించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని బీజేవైఎం రాష్ట్ర అధికార ప్రతినిధి మనోజ్‌కుమార్ అన్నారు. శుక్రవారం స్థానిక జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో బీజేవైఎం ఆధ్వర్యంలో పుల్వామా ఘటనలో అమరులైన సైనికుల చిత్రపటాలకు నివాళులర్పించారు. కార్యక్రమంలో దామోదర్, శివశంకర్, కార్తీక్, ప్రణయ్, నవీన్, కిరణ్, ప్రదీప్, అరవింద్ తదితరులు పాల్గొన్నారు.

షార్‌లో స్వచ్ఛత పఖ్వాడా



స్వచ్ఛత పఖ్వాడ కార్యక్రమంలో తొలి సంతకం పెడుతున్న షార్ డైరెక్టర్ రాజరాజన్, పక్కన షార్ ఉద్యోగులు

సూళ్లూరుపేట, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): శ్రీహరికోటలోని సతీష్ ధావన్ అంతరిక్ష కేంద్రం షార్‌లో శుక్రవారం డైరెక్టర్ ఆర్ముగం రాజరాజన్ ఆధ్వర్యంలో స్వచ్ఛత పఖ్వాడ కార్యక్రమం నిర్వహించారు. షార్ ఉద్యోగుల నుంచి సంతకాల సేకరణ చేపట్టారు. ఈ సందర్భంగా షార్ డైరెక్టర్ మాట్లా డుతూ స్వచ్ఛ భారత్ మిషన్ కార్యక్రమానికి షార్ ఉద్యోగుల అంకితభావాన్ని తెలియజేయడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమన్నారు. విద్యార్థులకు వ్యాస రచన, చిత్రలేఖనం, పరిశుభ్రతపై పోటీలు నిర్వహించారు. కార్యక్ర మంలో షార్ కంట్రోలర్ శ్రీనివాసుల రెడ్డి, సీనియర్ ఉద్యోగులు పాల్గొన్నారు.

రోడ్డు బాగు చేయాలని నిరసన



లారీలను అడ్డుకొని నిరసన తెలుపుతున్న పునబాక గ్రామస్తులు

పెళ్లకూరు, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): రోడ్డు బాగు చేయాలంటూ మండలంలోని పునబాక గ్రామస్తులు శుక్రవారం నిరసన వ్యక్తం చేశారు. చెంబేడు క్రాస్ రోడ్డు నుంచి పునబాక ఆర్అండ్‌బీ రోడ్డు మీదుగా వెళ్తున్న మెగా సంస్థకు చెందిన లారీలను అడ్డుకున్నారు. మెటల్, గ్రావెల్, మట్టి తరలిస్తున్న వాహనాలతో రోడ్డు గుంతలమయంగా మారిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. రోడ్డు బాగుచేస్తామని మెగా సంస్థ ప్రతినిధులు హామీ ఇవ్వడంతో నిరసన విరమించారు.

మాజీ ఎమ్మెల్యే ఎల్లసిరికి నివాళి

గూడూరు, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చెన్నూరు గ్రామంలో శుక్రవారం రాపూరు మాజీ ఎమ్మెల్యే ఎల్లసిరి శ్రీనివాసులురెడ్డి వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. ఆటో యూనియన్ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకుడు శ్రీనివాసులురెడ్డి, హరి, శివకుమార్, శంకరయ్య, బాబు, ప్రసాద్, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



శ్రీనివాసులురెడ్డి చిత్రపటానికి ఆటో యూనియన్ నాయకుల నివాళి

మహాశివరాత్రి ఉత్సవాలకు విచ్చేయండి



చిరంజీవికి, బాలకృష్ణకు ఆహ్వానపత్రిక అందిస్తున్న ఎమ్మెల్యే సుధీర్

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): పంచభూత లింగాల్లో వాయులింగేశ్వరుడిగా పరమశివుడు కొలువైన శ్రీకాళహస్తి క్షేత్రంలో జరిగే మహాశివరాత్రి ఉత్సవాలను దర్శించండి అంటూ ఎమ్మెల్యే సుధీర్ పలువురు ప్రముఖులను ఆహ్వానించారు. ఈ మేరకు హైదరాబాద్‌లో శుక్రవారం ఆహ్వాన పత్రికలు అందజేశారు. తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి, కేంద్ర మాజీ మంత్రి, మెగాస్టార్ చిరంజీవి, హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ, సినీ హీరో నితిన్, టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడును మర్యాదపూర్వకంగా కలిసి కలంకారి వస్త్రాలతో వారిని సత్కరించి ఆహ్వాన పుస్తకాలను అందజేసి ఉత్సవాల్లో జరిగే విశేష ఘట్టాలను వివరించారు. గత వైసీపీ పాలనలో ముక్కంటి ఆలయ మహాశివరాత్రి ఉత్సవాలకు ప్రముఖులను ఆహ్వానించడం విస్మరించారన్నారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత తొలి మహాశివరాత్రి ఉత్సవాలు కావడంతో శ్రీకాళహస్తి క్షేత్ర వైశిష్ట్యాన్ని వ్యాప్తి చేస్తున్నామన్నారు. అందుకే రెండు తెలుగు రాష్ట్రాలతో పాటు జాతీయస్థాయిలో ప్రముఖులందరినీ ఉత్సవాలకు ఆహ్వానిస్తున్నామని ఎమ్మెల్యే పేర్కొన్నారు.

వీధి వ్యాపారుల సభలను జయప్రదం చేయండి



కరపత్రాల ఆవిష్కరణలో ఏఐటీయూసీ నాయకులు

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): వీధి వ్యాపారుల సంఘం జిల్లా 2వ సభలను విజయవంతం చేయాలని ఏఐటీయూసీ నియోజకవర్గ కార్యదర్శి మణి, వీధి వ్యాపారుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి శివకుమార్ పిలుపునిచ్చారు. సభల కరపత్రాలను నారద పుష్కరిణి సమీపంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వీధి వ్యాపారుల సంఘం గౌరవ అధ్యక్షుడు జనమాల గురవయ్య మాట్లాడుతూ... మార్చి 4, 5 తేదీల్లో తిరుపతిలో సభలు జరుగుతాయన్నారు. పట్టణంలో ఫుట్‌పాత్‌ల మీద, వీధుల్లో, తోపుడు బండ్ల మీద, వస్తువులు, కూరగాయలు, పండ్లు, ఆహార పదార్థాలను వీధి వ్యాపారులు విక్రయిస్తూ జీవిస్తున్నారన్నారు. అసంఘటితంగా ఉన్న వీధి వ్యాపారులను గుర్తించి వారికి గుర్తింపు కార్డులు, లైసెన్స్‌లు అందించాలని సుప్రీం కోర్టు ఆదేశించినప్పటికీ ప్రభుత్వం, అధికారులు వీధి వ్యాపారుల చట్టాన్ని అమలు చేయడంలో విఫలమయ్యారన్నారు. గోపి, ప్రజానాట్య మండలి నాయకురాలు చారుశీల, వీధి వ్యాపారుల సంఘం పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు మురళి, జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.

విద్యా పరిశోధనలో కూనాటికి ప్రశంస



ప్రసంసాపత్రం అందుకుంటున్న కూనాటి సురేష్

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): విద్యా పరిశోధనలో భాగంగా శ్రీకాళహస్తికి చెందిన ఉపాధ్యాయుడు కూనాటి సురేష్ ఢిల్లీలో ప్రసంసలు అందుకున్నారు. ఊరందూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుడు కూనాటి సురేష్ గత ఏడాది జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకున్న విషయం విదితమే. ఇటీవల జాతీయ విద్యా పరిశోధనపై ఈనెల 4 నుంచి 13 వరకూ దేశవ్యాప్తంగా ఉపాధ్యాయులను ఎంపిక చేసి ఢిల్లీలో శిక్షణ ఇచ్చారు. నిష్ఠ జాతీయ స్థాయి రిసోర్స్ పర్సన్ల శిక్షణ కార్యక్రమంలో విద్యలో సాంకేతికత, ఇంటరాక్టివ్, ఉపకారణాల ఉపయోగం, సైబర్ నేరాల వలలో పడకుండా విద్యార్థులను రక్షించడం, అగ్యూమెంటెడ్ రియాలిటీ, వర్చువల్ రియాలిటీ, ఎనర్జైజింగ్ టెక్స్ట్ బుక్స్, విద్యార్థుల్లో 21వ శతాబ్ది నైపుణ్యాలను సాధించడం, సాంకేతిక మూల్యాంకన సాధనాలను రూపొందించడం, కాపీ రైట్ చట్టాలు, సోషల్ మీడియా ఉపయోగించడం వంటి అంశాలపై శిక్షణ ఇచ్చారు. ప్రతిభ కనబరిచిన కూనాటి సురేష్‌కు నిష్ఠ జాయింట్ డైరెక్టర్ అమరేంద్ర బెహరా ప్రశంసా పత్రం అందించారు. పలువురు ఉపాధ్యాయులు సురేష్‌ను అభినందించారు.

ప్రమాదాల నివారణపై మాక్‌డ్రిల్



కార్మికులకు అవగాహన కల్పిస్తున్న సీఐ

సత్యవేడు, ఫిబ్రవరి 14: పరిశ్రమల్లో అగ్ని, గ్యాస్ లీకేజీ ప్రమాదాలు సంభవించినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పాటించాల్సిన చర్యలపై శ్రీసిటీలోని మాండలెజ్ పరిశ్రమలో సీఐ శ్రీనివాసులు ఆధ్వర్యంలో ఫైర్, రెస్క్యూ బృందాలు మాక్ డ్రిల్ ద్వారా అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ పరిశ్రమల్లో ఏదైనా ప్రమాదం జరిగినప్పుడు అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. పోలీస్, ఫైర్ సిబ్బందికి వెంటనే సమాచారం అందించాలన్నారు. ప్రమాదంలో ఎవరైనా నడవలేని వారు ఉంటే క్యూఆర్‌టీ టీం ద్వారా ప్రథమ చికిత్స అందించాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్‌ఐ హరిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

బాల్యం అమూల్యం: ఆర్డీవో



అంగన్‌వాడీలకు సూచనలిస్తున్న ఆర్డీవో భానుప్రకాష్ రెడ్డి

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): బాల్యం అమూల్యమని శ్రీకాళహస్తి ఆర్డీవో భాను ప్రకాష్ రెడ్డి అన్నారు. పట్టణంలోని జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో శుక్రవారం అంగన్‌వాడీ సిబ్బందికి పోషణ్ బీ, విద్యా బీ అనే అంశాలపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ... ఆరేళ్ల లోపు పిల్లలకు పౌష్టికాహారం అందించడం ఎంతో కీలకమన్నారు. అలాగే వారి పసి మనసుల్లో విద్యా పునాదులు వేయాలన్నారు. పిల్లల్లో శారీరక ధృడత్వంతో పాటు మానసిక పరిపక్వత, సాంఘిక సృజనాత్మక ఆలోచనలను అంగన్వాడీ సిబ్బంది ఆత్మీయ భావంతో నింపాలన్నారు. ఆకట్టుకునే కథలతో భాషాభివృద్ధి నైపుణ్యాలకు పునాదులు వేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి కేవీఎన్ కుమార్, డిప్యూటీ డీఈఓ ప్రభాకర్ రాజు, శ్రీకాళహస్తి ఎంఈవోలు భువనేశ్వరి, బాలయ్య, ప్రధానోపాధ్యాయులు రాజేశ్వరి, సీడీపీవో శాంతి దుర్గ తదితరులు పాల్గొన్నారు.

నాగలాపురం (ఆంధ్రజ్యోతి): పిల్లల భవిష్యత్తుకు అంగన్‌వాడీ కేంద్రాల్లోనే పునాదులు పడతాయని నాగలాపురం ప్రభుత్వ ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి విజయకుమార్ చెప్పారు. శుక్రవారం పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పోషన్ బీ, పడాయి బీ అంశంపై ఐసీడీఎస్ సీడీపీవో శోభారాణి ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కార్యకర్తలకు శిక్షణ ఇచ్చారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శ్రీదేవి, సీహెచ్‌వో వేణుగోపాల్ పాల్గొన్నారు.

ఎంపేడులో హౌసింగ్ శాఖ విచారణ



గ్రామంలో విచారిస్తున్న గృహ నిర్మాణ శాఖ అధికారులు

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎంపేడులో హౌసింగ్ శాఖ అధికారులు విచారణ చేపట్టారు. గత వైసీపీ హయాంలో గృహ నిర్మాణాల పేరుతో పెద్ద ఎత్తున అవకతవకలు జరిగినట్లు ఇటీవల టీడీపీ నాయకులు తాటిపర్తి ఈశ్వర్ రెడ్డి, తాటిపర్తి రవీంద్రనాథ్ రెడ్డి అధికారులకు ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన గృహనిర్మాణ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శ్రీనివాసరావు, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ మోహన్ రావు సిబ్బందితో కలిసి శుక్రవారం ఎంపేడులో విచారణ చేపట్టారు. ఇంటింటికి వెళ్లి గృహ నిర్మాణాల రికార్డులు పరిశీలించారు. అలాగే జియో ట్యాగింగ్ నమోదు చేసుకున్నారు. పలు అవకతవకలు జరిగినట్లు ప్రాథమికంగా గుర్తించారు. విచారణ నివేదికను ఉన్నతాధికారులకు సమర్పించనున్నట్లు చెప్పారు.

నేడు ప్రజా వేదిక

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తి మున్సిపాలిటీ, మండలం పరిధిలోని సమస్యల పరిష్కారం కోసం శనివారం ప్రజా వేదిక నిర్వహించనున్నట్లు తహసీల్దార్ లక్ష్మీనారాయణ తెలిపారు. పట్టణంలోని పంచాయతీరాజ్ అతిథి గృహంలో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు వినతి పత్రాలు స్వీకరిస్తామన్నారు.

అడ్డదిడ్డంగా తవ్వకాలేంది స్వామీ?

హెచ్చరిక బోర్డులు లేక ప్రమాదాలు



కడూరు క్రాస్ వద్ద తవ్వేసిన రోడ్డు - ఇరుకు రోడ్డులో వెళ్తున్న వాహనాలు

వరదయ్యపాళెం, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కడూరు క్రాస్ నుంచి చెరివి చెక్ పోస్టు వరకు ఉన్న కంచరపాళెం పంచాయతీ సమీపంలో ఏజీ అండ్ పీ కంపెనీ నిర్వాహకులు గ్యాస్‌పైపులైన్ కోసం ఆర్‌అండ్‌బీ రోడ్డును అడ్డదిడ్డంగా తవ్వేస్తున్నారు. మరోవైపు వాటర్ పైప్‌లైన్ల కోసం తవ్వకాలు జరుగుతున్నాయి. దీంతో ఈ ప్రాంతాలు ప్రమాదాలకు నిలయాలుగా మారుతున్నాయి. కనీసం హెచ్చరిక బోర్డులు కూడా ఏర్పాటు చేయకపోవడంపై స్థానికులు మండిపడుతున్నారు. పరిశ్రమలకు వెళ్లే కార్మికులు ఇబ్బంది పడుతున్నారు. అనుమతులు లేకుండా రోడ్డును తవ్వుతున్న వారిపై అధికారులు చర్యలు తీసుకోవాల్సి ఉంది.

దామోదరం సంజీవయ్యకు ఘననివాళి



సంజీవయ్య జయంతి వేడుకలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆదిమూలం

పిచ్చాటూరు, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర తొలి దళిత ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్య యువతకు ఆదర్శప్రాయుడని ఎమ్మెల్యే ఆదిమూలం కొనియాడారు. సంజీవయ్య 104వ జయంతి వేడుకలను శుక్రవారం తిరుపతి కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ వెంకటేశ్వర్, జేసీ శుభం బన్సల్, అధికారుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే ఆదిమూలం పాల్గొని సంజీవయ్య చిత్రపటానికి పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... సంజీవయ్య సేవలను గుర్తించి ఆయన జయంతిని అధికారికంగా నిర్వహించే అవకాశం కల్పించిన సీఎం చంద్రబాబుకు కృతజ్ఞతలు చెబుతున్నానన్నారు. 30 ఏళ్ల వయసులోనే సంజీవయ్య ఎమ్మెల్యేగా, కేంద్రమంత్రిగా, రాష్ట్ర రెండో సీఎంగా ఉన్నత స్థానాలకు చేరుకున్నారని కొనియాడారు. 1976లో సంజీవయ్య అన్న కుమారుడు దామోదర్ మునస్వామి ఆధ్వర్యంలో తాము పుత్తూరులో అంబేడ్కర్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించామని గుర్తు చేసుకున్నారు. సంజీవయ్య హయాంలో జరిగిన సంక్షేమం, అభివృద్ధి పథకాలను కలెక్టర్, జేసీ కొనియాడారు. ఏఎస్పీ రవి మనోహరాచారి, సాంఘిక సంక్షేమ శాఖ జిల్లా అధికారి విక్రమ్, పలువురు ప్రజాప్రతినిధులు, దళిత సంఘాల నాయకులు పాల్గొన్నారు.

భూ సమస్యల పరిష్కారానికి అసైన్‌మెంట్ కమిటీ : సీపీఐ



ధర్నాలో సీపీఐ నాయకులు

వరదయ్యపాళెం, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): సత్యవేడు నియోజకవర్గంలోని భూ సమస్యల పరిష్కారానికి అన్ని రాజకీయ పార్టీలతో అసైన్‌మెంట్ కమిటీ వేయాలని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి చిన్నిరాజ్ డిమాండ్ చేశారు. నియోజకవర్గంలోని భూ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సూళ్లూరుపేట ఆర్డీవో కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నిరాజ్ మాట్లాడుతూ భూసమస్యలు పరిష్కరించాలని కోరుతూ తహసీల్దార్, ఆర్డీవో, కలెక్టర్ కార్యాలయాల చుట్టూ పేదలు ఏళ్ల తరబడి ప్రదక్షిణలు చేస్తున్నా పట్టించుకోవడం లేదన్నారు. బాలు, రమణయ్య, షణ్ముగం, బాబు తదితరులు పాల్గొన్నారు.

మంచినీటి క్యాన్ల వితరణ



వరదయ్యపాళెం, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): రానున్న వేసవి కాలం దృష్ట్యా చిన్నారుల కోసం బీజేపీ నాయకులు కేబీ గురుదేవ్, ఆర్.మురళి ఆధ్వర్యంలో మండలంలోని అంగన్వాడీ కేంద్రాలకు 65 మంచినీటి క్యాన్లు సీడీపీవో దేవకుమారి చేతుల మీదుగా వితరణ చేశారు. కార్యక్రమంలో దిలీప్ రాయల్, వేలూరు పురుషోత్తం, సిద్దులయ్య, శుభరత్నమ్మ, సూర్యనారాయణ, ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి రైతుకు గుర్తింపు సంఖ్య

బుచ్చినాయుడుకండ్రిగ, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): ప్రతి రైతుకు గుర్తింపు సంఖ్య జారీ చేయనున్నట్లు మండల వ్యవసాయ అధికారి భారతి తెలిపారు. మండల కేంద్రంలోని వ్యవసాయ కార్యాలయంలో రైతు గుర్తింపు సంఖ్య కోసం ఆన్‌లైన్‌లో వివరాలను నమోదు చేశారు. రైతులు ఆధార్‌కార్డుకు అనుసంధానమైన ఫోన్ నెంబరు, పట్టాదార్ పాసుపుస్తకం తీసుకుని రైతు సేవా కేంద్రంలో వీఏఏ ద్వారా రిజిస్టర్ చేసుకోవాలన్నారు. ప్రత్యేక గుర్తింపు సంఖ్యతోనే భవిష్యత్తులో రైతులకు ప్రభుత్వ పథకాలు అందుతాయని చెప్పారు. ఏఈవో రేవతి తదితరులు పాల్గొన్నారు.

ఇంటి స్థలాల కేటాయింపు



లక్కీ డ్రా తీస్తున్న అధికారులు

రేణిగుంట, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): చెన్నై - తిరుపతి రైల్వే లైన్ నిర్మాణంతో నష్టపోయిన గువ్వల కాలనీవాసులు, దోబీ కాలనీ నిర్వాసితులకు శుక్రవారం తలా మూడు సెంట్ల వంతున ఇంటి స్థలాలను కేటాయించారు. ఆ మేరకు తహసీల్దారు కార్యాలయంలో 51 మంది నిర్వాసితులకు లక్కీ డ్రా ద్వారా ప్లాట్ల నెంబర్లను ఇచ్చారు. ఈ కార్యక్రమంలో తహసీల్దారు సురేష్‌బాబు, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పొలం దారి ఆక్రమణ తొలగించండి: సీపీఎం



గ్రామస్తులతో కలసి ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు

పిచ్చాటూరు, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఓబులరాజు కండ్రిగ దళితవాడలోని పేదలు తమ పొలాలకు వెళ్లే బాటను ఆక్రమణ నుంచి తొలగించాలని సీపీఎం ఆధ్వర్యంలో నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు దాసరి జనార్దన్ మాట్లాడుతూ ... ఓబుల్‌రాజు కండ్రిగ దళితులకు ప్రభుత్వం 20 సంవత్సరాల ముందు భూములు పంపిణీ చేసి బాటను కూడా ఏర్పరిచిందన్నారు. ఆ బాటను గోవర్ధనగిరి గ్రామానికి చెందిన వైసీపీ నాయకుడు దౌర్జన్యంగా ఫెన్సింగ్ వేయడమే కాకుండా భూము ల్లోకి వెళ్లనీయకుండా అడ్డుకుంటున్నా రని మండిపడ్డారు. ఈ విషయంపై దళితులు అనేక పర్యాయాలు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారన్నారు. అలాగే రెవెన్యూ సదస్సులో కూడా వినతిపత్రం ఇచ్చారన్నారు. ఈక్రమంలో సర్వే చేస్తున్నట్లు అధికారులు చెప్పారన్నారు. అయితే వైసీపీ నాయకుడు అందుబాటులో లేడనే కారణంగా వాయిదా వేయడంపై మండిపడ్డారు. పిచ్చాటూరు, కేవీబీపురం సీపీఎం ప్రాంతీయ కార్యదర్శి నాగరాజు, రామచంద్రారెడ్డి, మునిశంకర్ పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్ హత్య కేసులో మరొకరి అరెస్ట్

సత్యవేడు, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఓబుల రాజు కండ్రిగలో ఆటో డ్రైవర్ లక్ష్మయ్య హత్య కేసులో మరొకరిని అరెస్ట్ చేసినట్లు ఎస్‌ఐ రామస్వామి తెలిపారు. ఈ నెల 3న ఆటో బాడుగ విషయంలో చెలరేగిన వివాదంలో గ్రామంలోని అరుధంతివాడకు చెందిన ఆటో డ్రైవర్ లక్ష్మయ్యపై గ్రామానికి చెందిన జగదీష్ రాజు, భాస్కర్‌రాజు భౌతిక దాడికి పాల్పడ్డారు. ఈ దాడిలో గాయపడ్డ లక్ష్మయ్య ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. లక్ష్మయ్య కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ రామస్వామి కేసు నమోదు చేసి, విచారణ చేపట్టారు. ఈ క్రమంలో ఈనెల 8న జగదీష్‌రాజును అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. పరారీలో ఉన్న మరో నిందితుడు భాస్కర్‌రాజును శుక్రవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

మద్యం దుకాణం వద్ద గొడవ

● నలుగురిపై కేసు నమోదు

రేణిగుంట, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): మద్యం దుకాణం వద్ద జరిగిన గొడవ సంఘటనలో నలుగురిపై కేసు నమోదైంది. పాత విమానాశ్రయం రోడ్డులోని ఓ మద్యం దుకాణం వద్ద గుత్తివారిపల్లికి చెందిన యువకుడు గురువారం రాత్రి క్వార్టర్‌కు డబ్బులివ్వగా రూ.10 అదనంగా పెరిగిందని క్యాషియర్ చెప్పారు. దీంతో ఎమ్మార్పీ కంటే అదనంగా అడగడంపై వివాదం తలెత్తింది. దీంతో దుకాణ సిబ్బందికి, యువ కుడు ఘర్షణ పడ్డారు. ఈ విషయమై ఇరువర్గాలు పోలీసులకు ఫిర్యాదు చేయగా దుకాణంలోని ముగ్గురితోపాటు యువకుడిపై కేసు నమోదు చేసి శుక్రవారం స్టేషన్ బెయిల్ ఇచ్చినట్లు గాజులమండ్యం పోలీసులు తెలిపారు.

ప్రేమించి మోసం చేసిన వ్యక్తిపై పోక్సో కేసు

కేవీబీపురం, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని హనుమాయి కండ్రిగకు చెందిన మునెమ్మ (19) గాజులమండ్యం మండలం ఎస్సీ కాలనీకి చెందిన ప్రవీణ్ (27) రేణిగుంట వద్ద ఓ ప్రైవేట్ ఫ్యాక్టరీలో పనిచేస్తుంటారు. మూడేళ్లుగా ప్రేమించుకుం టున్న వీళ్లు పెళ్లి చేసుకోవాలనుకున్నారు. అయితే ప్రవీణ్ వేరే అమ్మాయిని వివాహం చేసుకున్నాడు. అయినా మునెమ్మ.. ప్రవీణ్‌తో సన్నిహితంగా ఉండేది. ఇటీవల మునెమ్మ గర్భం దాల్చింది. దీంతో వీరిద్దరి మధ్య గొడవలు ప్రారంభమయ్యాయి. ఈక్రమంలో బాధితురాలు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా ఎస్‌ఐ నరేష్ దర్యాప్తు చేపట్టారు. ఈ క్రమంలో ప్రవీణ్‌పై పోక్సో కేసు పెట్టి అదుపులోకి తీసుకున్నారు. శ్రీకాళహస్తి కోర్టుకు తరలించారు.

రోడ్డు ప్రమాదంలో ట్రాక్టర్ డ్రైవర్ మృతి

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో ట్రాక్టర్ డ్రైవర్ వెంకటయ్య మృతి చెందాడు. ఈ ఘటన ఏర్పేడు మండలంలోని చింతలపాళెం వద్ద గురువారం జరిగింది. శ్రీకాళహస్తి మండలం గొల్లపల్లికి చెందిన వెంకటయ్య ట్రాక్టర్ మరమ్మతుల కోసం స్వయంగా నడుపుకుంటూ ఏర్పేడుకు వెళ్లాడు. తిరుగు ప్రయాణంలో చింతలపాలెం వద్ద ట్రాక్టర్ అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ఘటంలో వెంకటయ్య వాహనం కింద ఇరుక్కుని అక్కడికక్కడే మృతి చెందాడు. ఏర్పేడు పోలీసులు మృతదేహాన్ని ఏరియా ఆస్పత్రి మార్చురీకి తరలించారు.

కిచెన్ గార్డెన్ తప్పనిసరి

బుచ్చినాయుడుకండ్రిగ, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): ప్రతి మహిళ కిచెన్ గార్డెన్, హోం కంపోస్టు పిట్‌ను ఏర్పాటు చేసుకోవాలని ఎంపీడీవో త్రివిక్రమ్‌రావు సూచిం చారు. మండల కేంద్రంలోని వెలుగు కార్యాల యంలో మండల సమాఖ్య సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కిచెన్ గార్డెన్, హోం కంపోస్టు పిట్ ఏర్పాటు కోసం ఆసక్తి కలిగిన మహిళలను ఈనెల 22వ తేది లోపు నమోదు చేయించాలన్నారు. అలాగే ఎస్పీడీ సీఎల్ ద్వారా పీఎం సూర్య ఘర్ పథకం కింద గృహావసరాలకు రాయితీపై సోలార్ విద్యుత్‌పై దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో స్త్రీ నిధి మేనేజర్ వనజ, ఏపీఎం మునెయ్య, సీసీలు పాల్గొన్నారు.

మహాశివరాత్రి ఉత్సవాల బందోబస్తుపై దిశానిర్దేశం



బత్తినయ్య కోన వద్ద డీఎస్పీ తదితరులు

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి) : ఏర్పేడు మండలంలో మహాశివరాత్రి ఉత్సవాల కోసం బందోబస్తు ఏర్పాట్లపై అధికారులు కసరత్తు చేశారు. ఈ మేరకు రేణిగుంట డీఎస్పీ శ్రీనివాసరావు, సీఐ జయచంద్ర మండలంలోని బత్తినయ్య కోన, సదాశివకోన, చెల్లూరు డ్యాం పరిసరాలను శుక్రవారం పరిశీలించారు. ఆయా ప్రాంతాల్లో శివరాత్రి రోజున భక్తుల రద్దీపై ఆరా తీశారు. బందోబస్తుపై సీఐకు సూచనలు చేశారు.

బైకు దహనంపై ఫిర్యాదు



బుచ్చినాయుడుకండ్రిగ, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఇంటి వద్ద ఉన్న బైకును నీర్పాకోట దళితవాడకు చెందిన నరసింహులు గురువారం అర్ధరాత్రి దహనం చేశాడని శుక్రవారం పోలీస్‌స్టేషన్‌లో ముత్తు లింగేశ్వరయ్య ఫిర్యాదు చేశారు. నరసింహులు మద్యం మత్తులో రాత్రి సమయంలో ఇంటి దగ్గరకు వచ్చి గొడవ చేసి వెళ్లి అర్ధరాత్రి వేళ బైకుపై పెట్రోల్ పోసి తగలబెట్టాడని పేర్కొన్నారు. బైకు విలువ సుమారు రూ.లక్ష ఉంటుందని తెలిపారు.

గుర్తు తెలియని మహిళ మృతి



శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): గుర్తు తెలియని మహిళ అనారోగ్యంతో మృతి చెందింది. పట్టణంలోని ఆర్టీసీ బస్టాండు రెండో గేటు ఎదురుగా ఉన్న దుకాణాల వద్ద గుర్తు తెలియని మహిళ మృతి చెందినట్టు శ్రీకాళహస్తి 1వ పట్టణ పోలీసులకు సమాచారం అందించారు. సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మృతురాలు వివరాలు కోసం ఆరా తీశారు. గత కొంతకాలంగా మహిళ చుట్టుపక్కల ప్రాంతాల్లో యాచిస్తున్నట్లు గుర్తించారు. మృతదేహాన్ని ఏరియా ఆస్పత్రి మార్చురీకి తరలించారు.